వాయిస్ ఆఫ్ ప్రజలు
# వాయిస్ టుడే
VOICE OF PRAJALU
TGTEL/25/A2649
తెలుగు దినపత్రిక
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10
శుక్రవారం, మార్చి 6, 2026
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## మెస్సీపై ట్రంప్ ప్రశంసలు



2025 మేజర్ లీగ్ సాకర్ (ఎంఎల్ఎస్) ఛాంపియన్స్‌గా నిలిచిన ఇంటర్ మయామి జట్టుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లో ఘనంగా ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని ప్రత్యేకంగా అభినందించారు. చరిత్రలో ఏ అమెరికా అధ్యక్షుడికీ దక్కని గౌరవం తనకు దక్కిందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ... "ఈ రోజు 2025 ఎంఎల్ఎస్ కప్ ఛాంపియన్స్ ఇంటర్ మయామికి ఆతిథ్యం ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. ఇంతకుముందు ఏ అమెరికా అధ్యక్షుడికీ దక్కని ఒక ప్రత్యేకమైన అవకాశం నాకు దక్కింది. లియోనెల్ మెస్సీ, వైట్‌హౌస్‌కు స్వాగతం" అని అన్నారు. మెస్సీ జట్టులోకి వచ్చిన తర్వాత ఇంటర్ మయామి ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపిందని కొనియాడారు.



## తెలంగాణకు కొత్త గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా


- హిమాచల్‌ప్రదేశ్ నుంచి తెలంగాణకు శుక్లా బదిలీ
- ప్రస్తుత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు మహారాష్ట్ర బాధ్యతలు
- దేశవ్యాప్తంగా గవర్నర్లు, ఎల్‌జీల మార్పులు
- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉత్తర్వులు జారీ
- పలువురు రాష్ట్రాల్లో కీలక పరిపాలనా పునర్వ్యవస్థీకరణ

# ఇంగ్లండ్‌పై భారత్ ఘనవిజయం!



- సెమీఫైనల్ ఉత్కంఠలో 7 పరుగుల తేడాతో గెలుపు.. సంజు సామ్సన్ మెరుపు ఇన్నింగ్స్
- కీలక సమయంలో మెరిసిన సంజు సామ్సన్
- ఆదివారం భారత్ వర్సెస్ న్యూజిలాండ్
- చివరి బంతి వరకు పోరాడి ఓడిన ఇంగ్లండ్

శుక్రవారం జరిగిన హై-వోల్టేజ్ సెమీఫైనల్ పోరులో భారత్7 పరుగుల స్వల్ప తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసి గ్రాండ్‌గా ఫైనల్లోకి దూసుకెళ్లింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్, నిర్ణీత ఓవర్లలో పరుగుల వరద పారించింది. ముఖ్యంగా స్టార్ బ్యాటర్ సంజు సామ్సన్ మరోసారి ఆకాశమే హద్దుగా చెలరేగిపోయి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. సామ్సన్ వీరోచిత ఇన్నింగ్స్ ధాటికి భారత్ భారీ స్కోరును నమోదు చేయగలిగింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్‌ను బెతెల్ తన అద్భుత శతకంతో గెలిపించే ప్రయత్నం చేసినప్పటికీ, భారత బౌలర్లు కట్టుదిట్టమైన బంతులతో విజయాన్ని అడ్డుకున్నారు. చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లు ఒత్తిడిని అధిగమించి విజయాన్ని ఖాయం చేశారు.





# కొనసాగుతున్న యుద్ధ బీభత్సం

### అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్‌లో భారీ విధ్వంసం


- ప్రతిగా చమురు నౌకలు, గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతిదాడులు
- పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా చమురు నౌకపై మెరుపు దాడి
- యూఏఈ, ఖతర్, అజర్‌బైజాన్‌లపై డ్రోన్ దాడులతో ఉద్రిక్తత
- నౌకాశ్రయాలు, సైనిక స్థావరాలపై పరస్పర దాడులు
- యుద్ధంలో ఇప్పటివరకు వెయ్యికిపైగా ప్రాణనష్టం

దుబాయ్: పశ్చిమాసియా ప్రాంతంలో యుద్ధ పరిస్థితులు రోజు రోజుకు తీవ్రరూపం దాలుస్తున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో ఇరాన్‌లో విస్తృత స్థాయిలో విధ్వంసం చోటుచేసుకోగా, ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై తీవ్ర దాడులు కొనసాగిస్తోంది. గురువారం యుద్ధం ఆరో రోజుకు చేరుకోగా క్షిపణులు, బాంబులు, డ్రోన్లతో పరస్పర దాడులు కొనసాగుతున్నాయి. నౌకలు, నౌకాశ్రయాలు, సైనిక స్థావరాలు లక్ష్యంగా చేసుకుని ఇరు పక్షాలు విరుచుకుపడుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో అమెరికాకు చెందిన చమురు నౌకపై దాడి చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఆ దాడి వల్ల

(మిగతా 2వ పేజీలో)

## సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి రాజ్యసభకు లాంఛనమే

- కాంగ్రెస్ అభ్యర్థులుగా సింఘ్వీ, వేం నామినేషన్లు దాఖలు
- సంఖ్యాబలం లేక పోటీకి దిగని బీఆర్ఎస్
- స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు అవకాశం
- సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పత్రాల సమర్పణ
- రెండోసారి రాజ్యసభకు వెళ్లనున్న సింఘ్వీ
- రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేస్తానన్న వేం నరేందర్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ నుంచి రాజ్యసభకు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి ఎన్నిక దాదాపు ఖరారైంది. కాంగ్రెస్ పార్టీ వారిద్దరినీ అభ్యర్థులుగా ప్రకటించగా గురువారం శాసనసభ ప్రాంగణంలో ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. రాష్ట్రంలో తగినంత సంఖ్యాబలం లేకపోవడంతో ప్రతిపక్ష బీఆర్ఎస్ రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టలేదు. స్వతంత్ర అభ్యర్థిగా సాయి అనే వ్యక్తి నామినేషన్ దాఖలు చేసినప్పటికీ అవసరమైన పది మంది ఎమ్మెల్యేల మద్దతు లేకపోవడంతో ఆయన నామినేషన్ పరిశీలనలోనే తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉందని అసెంబ్లీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో కాంగ్రెస్ హైకమాండ్ ప్రతిపాదించిన సింఘ్వీ రెండోసారి, వేం నరేందర్‌రెడ్డి తొలిసారి రాజ్యసభలో అడుగుపెట్టడం లాంఛనంగా మారింది. గురువారం ఉదయం కాంగ్రెస్ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి అభ్యర్థులు శాసనసభకు చేరుకున్నారు. ఉదయం పది ముప్పై ప్రాంతంలో మొదటి విడతగా


(మిగతా 2వ పేజీలో)



### విధ్వంసం చేయకుండానే మూసీ సుందరీకరణ పనులు చేయవచ్చు: కేటీఆర్

- బీఆర్ఎస్ హయాంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేశామన్న కేటీఆర్
- ప్రజల ఆస్తులకు నష్టం చేయకుండా అభివృద్ధి చేయవచ్చని నిరూపించామన్న కేటీఆర్
- సుందరీకరణ పనులు తమకు అప్పగిస్తే రూ.16 వేల కోట్లకే చేసి చూపిస్తామని సవాల్

## డిజిటల్ జనగణనకు శ్రీకారం



- దేశ చరిత్రలో తొలిసారి పూర్తిగా డిజిటల్ విధానంలో జనాభా లెక్కలు
- యాప్‌లు, పోర్టల్స్, మస్కట్‌లను ఆవిష్కరించిన కేంద్ర హోం మంత్రి షా
- ఇంటింటి సర్వేకు సుమారు 30 లక్షల మంది సిబ్బంది రంగంలోకి
- 16 భాషల్లో స్వీయ నమోదు సౌకర్యం కల్పించిన కేంద్రం
- రెండు దశల్లో జనగణన నిర్వహణకు కార్యాచరణ
- 2027 మార్చి ఒకటిని ప్రామాణిక తేదీగా నిర్ణయం

## ఏపీలో నేటి నుంచి పదో తరగతి హాల్ టికెట్ల జారీ

- నేడు ఉదయం 11 గంటలకు పదో తరగతి హాల్ టికెట్లు విడుదల
- మార్చి 16 నుంచి ప్రారంభం కానున్న పబ్లిక్ పరీక్షలు
- వెబ్‌సైట్‌తో పాటు వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు





## రాజ్యసభకు నితీశ్ నామినేషన్

- ఎన్డీయే తరపున నామినేషన్ దాఖలు చేసిన బిహార్ సీఎం
- అమిత్ షా సమక్షంలో పత్రాలు సమర్పించిన నితీశ్ కుమార్
- బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ సహా ఆరుగురు అభ్యర్థులు
- సీఎం పదవి నుంచి తప్పుకుంటున్నట్లు నితీశ్ ప్రకటన
- కొత్త ప్రభుత్వానికి తన పూర్తి సహకారం ఉంటుందని వెల్లడి

# కొనసాగుతున్న యుద్ధ బీభత్సం

నౌకకు నిప్పంటుకుని భారీగా మంటలు ఎగసిపడుతున్నాయని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ తెలిపింది. శ్రీలంక తీర సమీపంలో తమ యుద్ధనౌకపై అమెరికా జలాంతర్గామి దాడి చేసి ముంచేసినందుకు ప్రతీకారంగానే ఈ చర్య చేపట్టినట్లు ఇరాన్ వెల్లడించింది. అయితే అమెరికా మాత్రం తమ చమురు నౌకపై దాడి జరిగిన విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించలేదు. ఇదే సమయంలో దక్షిణ ఇరాన్‌లోని కీలక నౌకాశ్రయం బందర్ అబ్బాస్‌పై అమెరికా యుద్ధ విమానాలు భారీ స్థాయిలో దాడులు చేసినట్లు సమాచారం. ఆ ప్రాంతంలో గంటల పాటు భారీ పేలుళ్లు వినిపించాయని స్థానిక మీడియా కథనాలు తెలిపాయి. హార్మూజ్ జలసంధికి అత్యంత సమీపంలో ఉన్న ఈ నౌకాశ్రయం వ్యూహాత్మకంగా కీలకమైనదిగా భావిస్తున్నారు. గల్ఫ్ ప్రాంతంలో మరికొన్ని చమురు నౌకలు కూడా దాడులకు గురయ్యాయి. కువైట్ సముద్ర జలాల్లో ఒక చమురు నౌకపై దాడి జరగడంతో అందులోని చమురు సముద్రంలోకి ఒలికిపోతున్నట్లు సమాచారం. అలాగే ఇరాక్‌లోని ఖోర్ అల్ జుబెయిర్ నౌకాశ్రయం వద్ద బహమాస్‌కు చెందిన మరో చమురు నౌకపై ఆత్మాహుతి దాడి జరిగినట్లు తెలుస్తోంది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి గల్ఫ్ ప్రాంతంలో దాడులకు గురైన చమురు నౌకల సంఖ్య తొమ్మిదికి చేరినట్లు సమాచారం. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై కూడా ఇరాన్ డ్రోన్ దాడులు కొనసాగిస్తోంది. జెరూసలేం, టెల్ అవీవ్ నగరాలపైకి క్షిపణులు, డ్రోన్లు దూసుకురావడంతో ప్రజలు వేలాదిగా భూగర్భ బంకర్లలో ఆశ్రయం పొందుతున్నారు. యూఏఈపై ప్రయోగించిన ఆరు ఖండాంతర క్షిపణులు, వందకు పైగా డ్రోన్లను అడ్డుకుని కూల్చేసినట్లు ఆ దేశం ప్రకటించింది. అబుదాబిలో డ్రోన్ శకలాలు పడి ఆరుగురు గాయపడినట్లు సమాచారం. ఖతర్‌లోని దోహా నగరంలో అమెరికా సైనిక స్థావరాల సమీపంలో డ్రోన్ దాడులు జరిగాయి. దాంతో ఆ ప్రాంతాల్లోని ప్రజలను ఖాళీ చేయించారు. మరోవైపు అజర్‌బైజాన్‌లోని నఖిచెవాన్ ప్రాంతంలో విమానాశ్రయం సమీపంలో పేలుళ్లు సంభవించడంతో అక్కడి గగనతలాన్ని మూసివేశారు. తమపై జరిగిన డ్రోన్ దాడులపై అజర్‌బైజాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో ఇరాన్‌లోని అనేక నగరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. టెహ్రాన్‌తో పాటు పలు నగరాలపై నిరంతరంగా బాంబులు, క్షిపణులు పడుతున్నాయి. ఇప్పటివరకు 300కిపైగా బాలిస్టిక్ క్షిపణి



ప్రయోగ కేంద్రాలను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఐదు వేలకుపైగా భారీ బాంబులు, వెయ్యికి పైగా క్షిపణులు ప్రయోగించినట్లు తెలిపింది. ఈ యుద్ధంలో ఇప్పటివరకు వెయ్యి రెండువందల మందికిపైగా మరణించినట్లు ఇరాన్ వెల్లడించింది. మరోవైపు లెబనాన్‌పై కూడా ఇజ్రాయెల్ దాడులను మరింత పెంచింది. బీరూట్‌తో పాటు పలుచోట్ల హెజ్బొల్లా స్థావరాలు, ఆయుధాగారాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణి దాడులు చేసింది. ట్రిపోలీలోని శరణార్థుల శిబిరంపై జరిగిన దాడిలో ఇద్దరు మరణించడంతో లెబనాన్‌లో మృతుల సంఖ్య డెబ్బై దాటింది. యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియా దేశాల్లో విమాన సర్వీసులు దాదాపు ఐదు రోజులుగా నిలిచిపోయాయి. అయితే గురువారం కొన్ని దేశాలు పరిమితంగా విమానాలను నడపడంతో వేలాదిమంది విదేశీయులు తమ దేశాలకు తిరుగు ప్రయాణమయ్యారు. పరిస్థితులు ఇంకా ఉద్రిక్తంగానే కొనసాగుతున్నాయని అంతర్జాతీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

# సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి రాజ్యసభకు లాంఛనమే

నామినేషన్లు దాఖలు చేశారు. అనంతరం మధ్యాహ్నం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీకి రావడంతో ఆయన సమక్షంలో మరో సెట్ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేశారు. అభిషేక్ మను సింఘ్వీ మొత్తం మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా వేం నరేందర్‌రెడ్డి నాలుగు సెట్లు సమర్పించారు. మిత్రపక్షంగా ఉన్న ఎంఐఎం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు అహ్మద్ బిన్ బలాలా, జుల్ఫికర్ అలీ ఒక సెట్ నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. రాజ్యసభ సభ్యత్వానికి అవసరమైన నలభై మంది ఎమ్మెల్యేల బలం లేకపోవడంతో బీఆర్ఎస్ పోటీకి దిగలేదని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. నామినేషన్ దాఖలు అనంతరం అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి గాంధీ భవన్‌కు వెళ్లగా పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి ఘన స్వాగతం పలికారు. అక్కడ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సింఘ్వీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి రెండోసారి రాజ్యసభకు వెళ్లడం తనకు అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. తనను మరోసారి ఎంపిక చేసిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రయోజనాల కోసం పార్లమెంటులో గట్టిగా స్వరం వినిపిస్తానని చెప్పారు. వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుంచి రాజ్యసభకు వెళ్లడం తనకు గౌరవంగా ఉందన్నారు. ఇప్పటివరకు ప్రజా సమస్యలపై ఎలా పనిచేశానో భవిష్యత్తులోనూ అలాగే కొనసాగిస్తానని తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కుల కోసం పార్లమెంటులో పోరాడతానని స్పష్టం చేశారు. తనను అభ్యర్థిగా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుమారుడి వివాహానికి హాజరయ్యేందుకు హైదరాబాద్‌కు వచ్చిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సీఎం రేవంత్‌రెడ్డి, సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

# తెలంగాణకు కొత్త గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**హిమాచల్‌ప్రదేశ్ నుంచి తెలంగాణకు శుక్లా బదిలీ**

**ప్రస్తుత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు మహారాష్ట్ర బాధ్యతలు**

**దేశవ్యాప్తంగా గవర్నర్లు, ఎల్‌జీల మార్పులు**

**రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉత్తర్వులు జారీ**

**పలువురు రాష్ట్రాల్లో కీలక పరిపాలనా పునర్వ్యవస్థీకరణ**



న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రానికి కొత్త గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లాను నియమిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న 73 ఏళ్ల శుక్లాను తెలంగాణకు బదిలీ చేస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న జిష్ణుదేవ్ వర్మను మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ చేశారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లను మార్చుతూ కేంద్రం విస్తృత స్థాయిలో పరిపాలనా మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. పరిపాలనా అనుభవం ఉన్న పలువురిని ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయగా, మరికొందరికి కొత్త బాధ్యతలు అప్పగించింది. కొన్ని కేంద్రపాలిత ప్రాంతాల్లో పనిచేస్తున్న లెఫ్టినెంట్ గవర్నర్లకు కూడా స్థానచలనం కల్పించడం విశేషం. ముఖ్యంగా లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌కు పదోన్నతి ఇచ్చి రాష్ట్ర గవర్నర్‌గా నియమించడం ఈ మార్పుల్లో ప్రత్యేకంగా నిలిచింది. ఇదిలా ఉండగా పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆనందబోస్ తన పదవికి రాజీనామా చేయగా దాన్ని రాష్ట్రపతి ఆమోదించారు. ప్రస్తుతం తమిళనాడు గవర్నర్‌గా ఉన్న ఆర్.ఎన్. రవిని పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా బదిలీ చేశారు. ఇతర నియామకాలలో భాగంగా బిహార్ గవర్నర్‌గా రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నైన్‌ను నియమించారు. నాగాలాండ్ గవర్నర్‌గా నంద్ కిశోర్ యాదవ్‌ను నియమించారు. హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా కవీందర్ గుప్తాను నియమించగా, తమిళనాడు గవర్నర్‌గా రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇక కేంద్రపాలిత ప్రాంతాల్లో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న వినయ్ కుమార్ సక్సేనాను లద్దాఖ్‌కు బదిలీ చేయగా, ఢిల్లీ కొత్త ఎల్‌జీగా తరణ్‌జీత్ సింగ్ సంధూను నియమించారు. ఈ మార్పులతో దేశవ్యాప్తంగా గవర్నర్లు, ఎల్‌జీల వ్యవస్థలో పెద్ద ఎత్తున పునర్వ్యవస్థీకరణ చోటుచేసుకున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం పరిపాలనలో సమర్థతను పెంచే దిశగా కీలకంగా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఏపీలో నేటి నుంచి పదో తరగతి హాల్ టికెట్ల జారీ




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థులకు కీలక అలర్ట్. రాష్ట్రంలో మార్చి 16 నుంచి జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి నేడు (మార్చి 5) ఉదయం 11 గంటలకు హాల్ టికెట్లు విడుదల చేశారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కె.వి. శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు నేటి నుంచి తమ హాల్ టికెట్లను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సాంకేతికతను మరింత అందుబాటులోకి తెస్తూ.. ఈసారి ‘మన మిత్ర‘ వాట్సాప్ నంబర్ 95523 00009 కు మెసేజ్ చేయడం ద్వారా లేదా పాఠశాల విద్యాశాఖకు చెందిన ‘లీప్‘ యాప్ ద్వారా కూడా సులభంగా హాల్ టికెట్లు పొందే వెసులుబాటు కల్పించారు. వెబ్‌సైట్‌లో జిల్లా, పాఠశాల పేరు, విద్యార్థి పేరు, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి హాల్ టికెట్ ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుంది. హాల్ టికెట్ల జారీకి సంబంధించి బోర్డు ఎటువంటి ప్రైవేటు ఏజెన్సీలకు గానీ, థర్డ్ పార్టీ వెబ్‌సైట్లకు గానీ అనుమతి ఇవ్వలేదని అధికారులు స్పష్టం చేశారు. కేవలం అధికారిక మార్గాలను మాత్రమే ఎంచుకోవాలని, అనధికారిక లింకులను నమ్మవద్దని సూచించారు. హాల్ టికెట్లలో ఏవైనా తప్పులు ఉన్నా, సందేహాలు ఉన్నా వెంటనే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు అధికారులు సూచించారు. మార్చి 16 నుంచి పరీక్షలు మొదలుకానున్న నేపథ్యంలో విద్యార్థులు ముందుగానే హాల్ టికెట్లు తీసుకుని సిద్ధంగా ఉండాలని కోరారు.

# రాజ్యసభకు నితీశ్ నామినేషన్



పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో కలిసి ఆయన ఎన్డీయే తరఫున గురువారం నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో విధానసభ కార్యాలయంలో అధికారులు ఈ పత్రాలను స్వీకరించారు. ఎన్డీయే తరఫున నామినేషన్లు వేసిన అభ్యర్థుల్లో జేడీయూకు చెందిన కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్, ఆర్ఎల్ఎం నాయకుడు ఉపేంద్ర కుష్వాహ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివేశ్ కుమార్ ఉన్నారు. వీరితో పాటు ఆర్జేడీ మద్దతుతో ప్రస్తుత సభ్యుడు, వ్యాపారవేత్త అమరేంద్ర ధారి సింగ్ కూడా నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ ఉన్నారు. నితీశ్ కుమార్ రాజ్యసభకు వెళ్లనున్నట్లు ప్రకటించడం బిహార్ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ఆయన సంకేతాలు ఇవ్వడంతో కొత్త ప్రభుత్వం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీజేపీ నాయకుడు సీఎం పదవిని చేపట్టే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా నితీశ్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ రాజకీయాల్లోకి వచ్చే అవకాశాలపై కూడా చర్చ జరుగుతోంది. ఇంజనీరింగ్ పట్టభద్రుడైన నిశాంత్ కొత్త ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టవచ్చని ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమ్రాట్ చౌదరి పేరు ముఖ్యమంత్రి రేసులో ముందంజలో ఉందని సమాచారం. మరోవైపు నితీశ్ నిర్ణయాన్ని నిరసిస్తూ జేడీయూ కార్యకర్తలు ఆయన నివాసం వద్ద పెద్ద సంఖ్యలో చేరారు. రాష్ట్ర రాజకీయాలను వదిలి రాజ్యసభకు వెళ్లాలన్న నిర్ణయం కార్యకర్తలను ఆశ్చర్యానికి గురిచేసిందని పార్టీ నేతలు పేర్కొన్నారు. నితీశ్ ముఖ్యమంత్రిగానే కొనసాగాలని పలువురు అభిప్రాయపడ్డారు. అయితే కేంద్ర మంత్రి గిరిరాజ్ కిశోర్ మాత్రం నితీశ్ నిర్ణయం స్వచ్ఛందమని చెప్పారు. రాజ్యసభకు వెళ్లాలన్న ఆలోచనను ఆయన మూడేళ్ల క్రితమే వెల్లడించారని తెలిపారు. భవిష్యత్తులో ఏర్పడే ప్రభుత్వం కూడా ఆయన నాయకత్వంలోనే కొనసాగుతుందని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా బిహార్‌లో జరుగుతున్న ఐదు రాజ్యసభ స్థానాల ఎన్నికల్లో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. ఆర్జేడీకి చెందిన రెండు స్థానాల్లో ప్రస్తుతం ఒకదానికి మాత్రమే ఆ పార్టీ పోటీ చేస్తోంది. మిగతా స్థానాలపై ఎన్డీయేకు బలమైన ఆధిక్యం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. నామినేషన్ దాఖలు చేయడానికి ముందు నితీశ్ కుమార్ తాను రాజ్యసభకు వెళ్లాలనుకుంటున్నట్లు ప్రకటించారు. రెండు దశాబ్దాలకు పైగా ప్రజలు తనపై నమ్మకం ఉంచి మద్దతిచ్చారని, ఆ బలంతోనే రాష్ట్రానికి సేవ చేసే అవకాశం దక్కిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏర్పడే కొత్త ప్రభుత్వానికి తన పూర్తి సహకారం, మార్గదర్శకత్వం ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా బిహార్‌తో తన అనుబంధం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# డిజిటల్ జనగణనకు శ్రీకారం



న్యూఢిల్లీ: దేశ చరిత్రలో తొలిసారిగా పూర్తిగా డిజిటల్ విధానంలో జనాభా లెక్కలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రపంచంలోనే అతిపెద్ద సర్వే ప్రక్రియగా గుర్తింపు పొందిన జనగణనను ఈసారి సాంకేతిక ఆధారిత విధానంలో చేపట్టాలని నిర్ణయించింది. సెన్సస్2027 కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన నాలుగు అత్యాధునిక డిజిటల్ యాప్‌లు, పోర్టల్స్‌తో పాటు ‘ప్రగతి’, ‘వికాస్’ అనే మస్కట్‌లను కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం ఢిల్లీలో ఆవిష్కరించారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని అమలు చేసేందుకు దేశవ్యాప్తంగా సుమారు ముప్పై లక్షల మంది సిబ్బందిని వినియోగించనున్నారు. గతంలో మాదిరిగా కాగితాలపై వివరాలు నమోదు చేయకుండా పూర్తిగా యాప్‌ల ఆధారంగా సమాచారాన్ని సేకరించనున్నారు. సీడాక్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక మొబైల్ యాప్‌ల ద్వారా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలను నమోదు చేస్తారు. అవసరమైనప్పుడు ఆఫ్‌లైన్‌లో కూడా డేటా సేకరించే విధంగా ఈ యాప్‌లను రూపొందించారు. ఈసారి ప్రజలకు స్వీయ నమోదు సౌకర్యాన్ని కూడా కేంద్రం కల్పిస్తోంది. ఎన్యుమరేటర్ ఇంటికి రాకముందే ప్రజలు తమ స్మార్ట్ ఫోన్ల ద్వారా కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. దేశంలోని 16 ప్రాంతీయ భాషల్లో ఈ సేవ అందుబాటులో ఉంటుంది. ఇలా నమోదు చేసిన తర్వాత ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య వస్తుంది. ఆ సంఖ్యను సిబ్బందికి చూపిస్తే సరిపోతుంది. జనగణన ప్రక్రియలో స్త్రీపురుషుల సమాన భాగస్వామ్యాన్ని ప్రతిబింబించేలా ‘ప్రగతి’, ‘వికాస్’ అనే మస్కట్‌లను రూపొందించారు. మహిళా ఎన్యుమరేటర్‌కు ‘ప్రగతి’, పురుష ఎన్యుమరేటర్‌కు ‘వికాస్’ అని పేర్లు పెట్టారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యాన్ని ఈ మస్కట్‌లు సూచిస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ కార్యక్రమం కోసం నాలుగు ప్రధాన డిజిటల్ సాధనాలను రూపొందించారు. హౌస్‌లిస్టింగ్ వెబ్ యాప్ ద్వారా శాటిలైట్ మ్యాప్‌ల ఆధారంగా డిజిటల్ బ్లాక్‌లను రూపొందిస్తారు. హెచ్ఎల్ఓ మొబైల్ యాప్ ద్వారా ఎన్యుమరేటర్లు సేకరించిన సమాచారాన్ని నేరుగా సర్వర్‌కు పంపించగలరు. స్వీయ నమోదు పోర్టల్ ద్వారా ప్రజలు తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. సెన్సస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా అధికారులు సర్వే పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. జనగణన మొత్తం రెండు దశల్లో నిర్వహించనున్నారు. మొదటి దశలో ఇళ్ల వివరాలను సేకరించే హౌస్ లిస్టింగ్ కార్యక్రమం 2026 ఏప్రిల్ ఒకటి నుంచి సెప్టెంబర్ 30 మధ్య రాష్ట్రాల సౌకర్యాన్ని బట్టి ముప్పై రోజుల పాటు జరుగుతుంది. రెండో దశలో వ్యక్తుల వివరాలను సేకరించే జనాభా లెక్కింపు ప్రక్రియను 2027 ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. ఈ రెండో దశలోనే కులగణన వివరాలను కూడా నమోదు చేయనున్నారు. జనాభా లెక్కల కోసం 2027 మార్చి ఒకటిని ప్రామాణిక తేదీగా నిర్ణయించారు. మంచు ప్రభావం ఎక్కువగా ఉండే లద్దాఖ్, జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో మాత్రం 2026 సెప్టెంబర్‌కల్లా ఈ సర్వే ప్రక్రియను పూర్తిచేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ విధంగా సాంకేతిక ఆధారిత డిజిటల్ జనగణన ద్వారా సమాచార సేకరణను మరింత వేగంగా, ఖచ్చితంగా నిర్వహించవచ్చని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

# దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్‌లో అరుదైన శస్త్రచికిత్స

## మహిళ ఛాతీ నుంచి 15×10 సెం.మీ భారీ కణితి తొలగింపు



సికింద్రాబాద్, మార్చి 05 (వాయిస్ టుడే ప్రతినిధి): క్యాన్సర్ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్న విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్ వైద్యులు అరుదైన, అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి వైద్యరంగంలో మరో మైలురాయిని నెలకొల్పారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన 36 ఏళ్ల మహిళ కుడి ఛాతీలో ఏర్పడిన 15×10 సెం.మీ పరిమాణం లోని భారీ కణితిని సురక్షితంగా తొలగించి ఆమెకు కొత్త జీవితం అందించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సంసున్ నహర్ బీబీ అనే మహిళ గత కొద్ది రోజులుగా తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు, ఛాతీ నొప్పితో బాధపడుతూ అనేక ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించగా వైద్య పరీక్షల అనంతరం ఆమె "రైట్ హెమిథోరాక్స్ ఫైబ్రోమాటోసిస్" అనే అరుదైన క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు, తప్పనిసరిగా సర్జరీ చేయాల్సిందేనని, శస్త్రచికిత్స అత్యంత సంక్లిష్టమైనదని, దీనికి లక్షల రూపాయల ఖర్చు అవుతుందని తేల్చడం జరిగిందన్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో హైదరాబాద్, విద్యానగర్ లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్ గురించి తెలుసుకొన్న కుటుంబ సభ్యులు నేరుగా ఆసుపత్రి వైద్య బృందాన్ని సంప్రదించారు. వైద్య బృందం వారి కేసును స్వీకరించి పరిశీలించిన ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్, మెడికల్ డైరెక్టర్ డా. యు. ఆజాద్ చంద్రశేఖర్ ఈ కేసును ఒక సవాలుగా స్వీకరించి చికిత్స ప్రారంభించారన్నారు.

ఈ సందర్భంగా డా.యు.ఆజాద్ చంద్రశేఖర్ మాట్లాడుతూ... ఇది అత్యంత క్లిష్టమైన, సవాలు తో కూడుకున్న కేసు. సాధారణంగా ఇటువంటి పరిస్థితుల్లో రోగి ప్రాణాలను కాపాడేందుకు మొత్తం ఊపిరితిత్తిని తొలగించే పరిస్థితి ఏర్పడుతుందనీ, కానీ, రోగి వయస్సు, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యంత జాగ్రత్తతో, నైపుణ్యంతో సీఈసిటీ, పెట్ - సీటీ స్కాన్, ట్రూ-కట్ బయాప్సీ నివేదికల ఆధారంగా ఖచ్చితమైన ప్రణాళికతో 'వాట్స్ గైడెడ్ ఎక్సిషన్' అనే అత్యాధునిక విధానంతో శస్త్రచికిత్సను చేపట్టామన్నారు. సుమారు 8 నుంచి 10 గంటల పాటు సాగిన ఈ ఈ శస్త్ర చికిత్స కొనసాగిందన్నారు. శస్త్రచికిత్స సమయంలో గుండె, ఊపిరితిత్తులు వంటి కీలక అవయవాలకు ఎలాంటి హాని కలగకుండా కేవలం కణితినే విజయవంతంగా తొలగించగలిగామన్నారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందనీ తెలిపారు. చికిత్సకు మంచి స్పందన చూపిన ఆమెను పది రోజుల్లోనే పూర్తిస్థాయి ఆరోగ్యంతో డిశ్చార్జ్ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ విజయానికి సహకరించిన వైద్య, నర్సింగ్, పారామెడికల్ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పేషెంట్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ... ఎంతో నిరాశ చెందిన తమకు డా.యు.ఆజాద్ చంద్రశేఖర్ ఎంతో నమ్మకం కలిగించి తిరిగి ఆశలు చిగురించేలా చేశారని చెప్పారు. ఎంతో నైపుణ్యంతో, నిబద్ధతతో, అత్యంత తక్కువ ఖర్చుతో విజయవంతంగా చికిత్స అందించించిన వైద్య బృందానికి, నర్సింగ్, ఇతర సిబ్బందికి ఎంతో ఋణ పడి ఉన్నామని వారిని మరువలేమని, ధన్యవాదాలు తెలియజేస్తున్నామని చెప్పారు.



## బికేఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బొంగునూరి కిషోర్ రెడ్డి

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

కుత్బుల్లాపూర్ మార్చ్ 5(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం కాలనీ, సూరారం గ్రామం, షాపూర్ నగర్, నెహ్రూ నగర్, గాజులరామారం, జగద్గిరిగుట్ట. ప్రభుత్వ పాఠశాలలోబి పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ పెన్నులను పంపిణీ చేసిన బిబి కే ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం 10వ తరగతి తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థిని విద్యార్థులకు ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన వారికి తమ ట్రస్ట్ ద్వారా బహుమతులు ఆర్థిక ప్రోత్సాహం అందజేస్తామని తెలియజేశారు అదేవిధంగా మధ్యతరగతి పేద విద్యార్థులకు అండగా ఉండి వారి చదువుకు అన్ని విధాల బికేఆర్ ట్రస్ట్ అండగా ఉంటుందని తెలియజేశారు విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీధర్ రెడ్డి , సంతోష్ ముదిరాజ్ , సురేందర్ రెడ్డి , గజ , పృథ్వీ ,మహేష్ , సందీప్, జగన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## మానికేశ్వరి నగర్ గంగపుత్ర సంఘం నూతన భవనానికి శంకుస్థాపన

### హాజరైన ఫిషరీస్ డిపార్ట్మెంట్ చైర్మన్ మెట్టు సాయికుమార్



సికింద్రాబాద్, మార్చి 05 (వాయిస్ టుడే ప్రతినిధి): తార్నాక డివిజన్ పరిధిలోని మాణికేశ్వరినగర్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ఫిషరీస్ డిపార్ట్మెంట్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. గంగపుత్ర సంఘ సభ్యులు ఐక్యతతో పనిచేస్తూ సంఘం అభివృద్ధికి పాటుపడాలన్నారు. సేవా భావంతో ఎదుగుతూ గంగపుత్ర సమాజానికి తోచిన విధంగా సహాయ సహకారాలు అందించాలని సంఘ సభ్యులకు సూచించారు. గంగపుత్ర సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మనికేశ్వరి నగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దుంపల సత్యనారాయణ, చైర్మన్ ఇటియల భూమ్రాజ్, కర్ణం వేణు, పాక శంకర్, సురేష్, రాచమల్ల స్వామి, బాలరాజ్ కోటేష్ కైలాష్ కూర శీను. తదితరులు పాల్గొన్నారు.

## నిందితులను తక్షణం శిక్షించాలి

### ప్రజాసంఘాల నిరసనలకు సిపిఐ(ఎం) మద్దతు



సికింద్రాబాద్, మార్చ్ 05 (వాయిస్ టుడే ప్రతినిధి): నాగర్కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రజక, దళిత కుటుంబాలపై జరిగిన దాడిని, రెండు నెలల పసిపాప హత్యను ఖండిస్తూ రజక, ప్రజా సంఘాలు చేపట్టిన నిరసన కార్యక్రమాలలో అరెస్టయిన వారిని గురువారం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, సీనియర్ నాయకులు డీజీ నరసింహారావు లు కలిసి సంపూర్ణ మద్ధతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమ్మెర గ్రామ సర్పంచ్ రాంరెడ్డి, ఇతర నిందితులపై ఘటన జరిగి రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ గానీ, హత్య కేసు గానీ నమోదు చేయలేదన్నారు. రాష్ట్రమంతా ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు తదితరులు ఘటనను ఖండిస్తున్నా, హోం మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు స్పందించకపోవడం విచారకరనన్నారు. బాధితులకు అండగా నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమనీ, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కేసు విచారణ కోసం ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి, నిందితులను అరెస్టు చేసి కఠిన శిక్ష పడేలా చూడాలనీ డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయకపోతే, రాబోయే శాసనసభ సమావేశాల సందర్భంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని, రేపు, ఎల్లుండి ప్రజాసంఘాలు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని, సంపూర్ణమద్ధతు తెలియజేస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తుందన్నారు.

## విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

### ఓయూ బిజినెస్ మేనేజ్మెంట్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీరాములు



హైదరాబాద్, మార్చి 05: విద్యార్థులు పూర్తిగా అధ్యాపకులు, పాఠ్యపుస్తకాలపైన ఆధారపడకుండా సొంత పరిజ్ఞానంతో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం డీన్ ప్రొఫెసర్ డి. శ్రీరాములు అన్నారు. నారాయణగూడలోని జాగృతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురువారం 'బిజ్నియర్ ఫెస్ట్-2026' పేరుతో నిర్వహించిన బిజినెస్ మీట్ను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు రూపొందించి ప్రదర్శనలో ఉంచి ఎగ్జిబిట్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యను అభ్యసించాలని అన్నారు. విద్యార్థులు సృజనాత్మకతను ఉపయోగించి కొత్త పద్ధతులను కనుగొనాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జాగృతి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఓ.శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ డి. జోసఫిన్ రెడ్డి, కార్యదర్శి ఎ. శశికిరణ్ రెడ్డి, ఎన్.సీతారెడి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# వేం నరేందర్ రెడ్డిని కలిసిన అనిల్ కుమార్ యాదవ్



శేరిలింగంపల్లి, మార్చి 5 (వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర నుంచి ఖాళీ అయిన రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితాను ప్రకటించింది పార్టీ అధిష్టానం. ముందుగా ఒక స్థానానికి అభిషేక్ మను సింఘ్వీ పేరును ప్రకటించగా రెండోవ స్థానానికి తీవ్ర పోటీ నెలకొంది. అయితే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదారుడు చిరకాల మిత్రుడు వేం నరేందర్ రెడ్డి పేరును ఖరారు చేయడంతో ఉత్కంఠ తెరపడింది. చేవెళ్ల, మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గల ఇంచార్జ్ గా శాసనసభ ఎన్నికలలో వేం నరేందర్ రెడ్డి పాత్ర కీలకంగా మారింది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన నేతగా,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నమ్మిన ఆత్మబంధువు గా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ అధికారం దిశగా పార్టీ శ్రేణులను ముందుకు తీసుకెళ్లడంలో రేవంత్ రెడ్డి మార్క్ రాజకీయం కనిపించింది. అనేక రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ పార్టీ వేం నరేందర్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని రేవంత్ రెడ్డి ప్రతిపాదించి నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డిని శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్ ప్రత్యేకంగా వేం నరేందర్ రెడ్డి నివాసంలో కలిసి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. అనిల్ కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ రానున్న రోజుల్లో అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతాయని అన్నారు. భారతదేశ రాజ్య పాలన బాధ్యతలు కాంగ్రెస్ పార్టీకి అప్పగించడానికి ప్రజలు సమయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. అగ్రరాజ్య అమెరికా అధ్యక్షుడికి నరేంద్ర సరెండర్ అయ్యాడని అది దేశ సమగ్రతకు విఘాతం అని అన్నారు. తెలంగాణ గడ్డ నుంచి ఢిల్లీ పార్లమెంట్ లోకి వేం నరేందర్ రెడ్డి ప్రాతినిధ్యం వహించడంతో దేశంలో "=ూ=జు" మార్క్ రాజకీయానికి తొలి అడుగు పడింది అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం లో ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డి మరో సారి అధికారంలోకి వస్తారని, దేశ రాజకీయాల్లో రాహుల్ గాంధీ ప్రధాని పీఠాన్ని అధిష్టిస్తారని తన ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కాంప్రమైజ్డ్ పీఎం ని దేశం చూసింది ఇకపై పోరాడే సత్తా ఉన్న వీరుడిని దేశం ప్రధానిగా చూడబోతుందని జోస్యం చెప్పారు.



## "శ్రీ గాయత్రి స్కూల్" ను ప్రారంభించిన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

కుత్బుల్లాపూర్ మార్చ్ 5(వాయిస్ టుడే) : 130 - సుభాష్ నగర్ డివిజన్ సుభాష్ నగర్ లో లక్ష్మీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ గాయత్రి స్కూల్ ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దడంలో శ్రీ గాయత్రి స్కూల్ అత్యున్నతంగా పనిచేస్తుందని విశ్వసిస్తున్నానని అన్నారు. పిల్లల భవిష్యత్తు రూపకల్పనలో పాఠశాల యాజమాన్యం, టీచర్లతో పాటు తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమన్నారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నరేందర్ కృష్ణ, నవీన్, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, అడపా శేషు కుంటి మల్లేష్, దుబాయ్ శ్రీను, సురేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



## మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన వేం నరేందర్ రెడ్డి , నర్సారెడ్డి భూపతి రెడ్డి

కుత్బుల్లాపూర్ మార్చ్ 5(వాయిస్ టుడే ): కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు నలమద ఉత్తమ్ కుమార్ రెడ్డి కలవడం జరిగింది ఈ కార్యక్రమంలో శాసనసభ సభ్యులు కడియం శ్రీహరి , చింతకుంట విజయరామారావు , రేవూరి ప్రకాష్ రెడ్డి , మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ , ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి , మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి.



## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు కొలన్ హన్మంత్ రెడ్డి ఆహ్వానం

కుత్బుల్లాపూర్ మార్చ్ 5(వాయిస్ టుడే): వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మరియు నల్లమల్లి ఆదర్శ మహిళా చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఈ నెల 18-03-2026, బుధవారం నాడు ప్రగతి నగర్‌లోని శ్రీకృష్ణ గార్డెన్స్ ఏసీ ఫంక్షన్ హాల్లో జరగనున్నాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొనవలసిందిగా కోరుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీ కొలన్ హన్మంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా నల్లమల్లి సామ్రాజ్యలక్ష్మి (వాసవి క్లబ్ జోనల్ చైర్పర్సన్ ఢ ట్రస్ట్ ఫౌండర్ చైర్పర్సన్), దేవరశెట్టి స్రవంతి, రాధిక, అనంతలక్ష్మి (ప్రోగ్రాం కోఆర్డినేటర్స్), వాసవి క్లబ్ సమైక్యశక్తి ప్రగతి నగర్ అధ్యక్షులు ఉప్పల వినయ్, జనరల్ సెక్రటరీ పోలా వెంకట్, వాసవి క్లబ్ వనిత సమైక్యశక్తి అధ్యక్షురాలు పోలా సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ ఎన్నికల నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ మార్చ్ 5(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ అసెంబ్లీ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ సభ్యుడి గా వెం నరేందర్ రెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమానికి హాజరయ్యారు...ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి కలిసి శాలువాతో సత్కరించారు...ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అన్నదమ్ముల మధ్య గొడవ..

## తమ్ముడిని హత్య చేసిన ముగ్గురికి 10 ఏళ్ల జైలు

శేరిలింగంపల్లి, మార్చి 5 (వాయిస్ టుడే): మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2016లో జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులకు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లి కోర్టు తీర్పు వెలువరించిందని సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహేంద్ర ప్రసాద్ మిశ్రా (29), ధర్మేంద్ర ప్రసాద్ మిశ్రా (45), బీరేంద్ర ప్రసాద్ మిశ్రా (37) అన్నదమ్ములు మాదాపూర్ పరిధిలోని సిద్ధిక్‌నగర్‌లో అద్దె గదిలో నివాసం ఉండేవారు. 18 నవంబర్ 2016న వీరి మధ్య జరిగిన గొడవలో దేవేంద్ర ప్రసాద్ మిశ్రాపై ముగ్గురు నిందితులు కత్తి మరియు కిటికీ గాజు పలకతో దాడి చేశారు. ఈ దాడిలో దేవేంద్ర ప్రసాద్ మిశ్రా గొంతు వద్ద తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 701/2016గా కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయస్థానం వారికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది. అనంతరం పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో విచారణ పూర్తి చేసిన రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లి కోర్టు ఎ× అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి శ్రీమతి. సి. పావని నిందితులు ముగ్గురినీ దోషులుగా తేల్చి, ఒక్కొక్కరికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని డీసీపీ తెలిపారు.

## తన వీరాభిమాని జిల్లపల్లికి ఎంపీ వద్దిరాజు ఆశీస్సులు



బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన వీరాభిమాని జిల్లపల్లి ఉపేందర్ పుట్టినరోజు సందర్భంగా ఆశీస్సులు అందజేశారు.ఖమ్మం వెంకటగిరికి చెందిన ఉపేందర్ కు వద్దిరాజు రవిచంద్ర అంటే చాలా కాలంగా ఎనలేని అభిమానం,గౌరవం. రవిచంద్ర రూపాన్ని ఉపేందర్ తన ఛాతిపై పచ్చబొట్టు పొడిపించుకుని గుండె నిండా గౌరవాన్ని, అభిమానాన్ని మరింత పెంచుకున్నారు.అలాగే, ఉపేందర్ ధరించే చొక్కాపై కూడా ఎంపీ రవిచంద్ర ఫోటో ఉన్న స్టిక్కర్ విధిగా ఉంటుంది.ఈ వీరాభిమాని అంటే ఎంపీ రవిచంద్రకు కూడా ఎనలేని ప్రేమ. పుట్టినరోజు సందర్భంగా గురువారం తనను కలిసిన ఉపేందర్ ను ఎంపీ వద్దిరాజు శాలువాతో సత్కరించి, మిఠాయి తినిపించి ఆశీస్సులు అందజేశారు, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.




## నూతన వధూవరులకు ఎంపీ వద్దిరాజు ఆశీస్సులు

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క-నందిని దంపతుల జ్యేష్ఠ కుమారుడు సూర్య విక్రమాదిత్య, జగదీష్ జే.అహూజా-దీప్తి జే.అహూజా దంపతుల కూతురు సాక్షితో ఎయిర్ పోర్ట్ సమీపాన ఉన్న జీఎంఆర్ అరేనాలో గురువారం ఘనంగా జరిగింది.ఈ పెళ్లికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావుతో కలిసి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి,కాలేరు వెంకటేష్,జాన్సన్ నాయక్ తదితర ప్రముఖులు హాజరై నూతన వధూవరులు సూర్య విక్రమాదిత్య -సాక్షిలకు తమ ఆశీస్సులు అందజేశారు.ఈ సందర్భంగా కేటీఆర్ ను కలిసేందుకు,కరచాలనం చేసేందుకు వందలాది మంది ఉత్సాహం చూపారు, పలువురు సెల్ఫీలు దిగారు.

## తెలంగాణ రాజ్యసభ సీట్లు బీసీలకే కేటాయించాలి

**దుంద్ర కుమారస్వామి డిమాండ్**

**సామాజిక న్యాయం ..... ప్రాతినిధ్యంలో కనిపించాలి**



హైదరాబాద్, మార్చి 5: తెలంగాణ నుంచి ఖాళీ కానున్న రెండు రాజ్యసభ స్థానాల భర్తీ నేపథ్యంలో, ఆ రెండు సీట్లను బీసీలకు కేటాయించాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుంద్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. కాచిగూడలో ఏర్పాటు చేసిన బీసీ సంఘాల సమావేశంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అభ్యర్థులను ప్రకటించబోతున్న ఈ సమయంలో బీసీ వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోందన్నారు. దశాబ్దాలుగా బీసీలు రాజకీయ అణిచివేతకు గురవుతున్నారని, జనాభాలో గణనీయ శాతం ఉన్నప్పటికీ చట్టసభల్లో తమ వంతు వాటాను పొందలేకపోతున్నారనే వాస్తవం ఆందోళన కలిగించేదిగా ఉందన్నారు. తెలంగాణ నుంచి రాజ్యసభకు ఇద్దరు సమర్థులైన బీసీ నాయకులను ఎంపిక చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తన సామాజిక న్యాయ వైఖరిని స్పష్టంగా నిరూపించుకోవచ్చని అభిప్రాయపడ్డారు.

బీసీల ప్రాతినిధ్యం 15 శాతం దాటని పరిస్థితుల్లో ఉన్నత సభల్లో అవకాశాలు కల్పించడం ద్వారానే నిజమైన రాజకీయ భాగస్వామ్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం పదవుల కేటాయింపుల్లో ప్రతిబింబించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుతం తీసుకునే నిర్ణయం కేవలం రెండు స్థానాల భర్తీ మాత్రమే కాకుండా, బీసీల రాజకీయ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే కీలక చర్యగా భావించబడుతోందన్నారు.

ఈ కార్యక్రమంలో జాతీయ గౌడ సంఘం అధ్యక్షుడు ఐలయ్య, డీవీవీ సత్యనారాయణ, రాజేష్ రమణా తదితరులు పాల్గొన్నారు.

# హఫీజ్పేట్ మున్నూరు కాపు సంఘం

# నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

## సమాజ అభివృద్ధి కోసం ఐక్యంగా పనిచేయాలని నేతల పిలుపు



కొండాపూర్, మార్చి 05, 2026 (వాయిస్ టుడే న్యూస్): కొండాపూర్ పరిధిలోని హఫీజ్పేట్ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించబడింది. ప్రేమ్ నగర్ ఏ-బ్లాక్లో ఉన్న మున్నూరు కాపు భవనం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సంఘ సభ్యులు, పెద్దలు, యువకులు, మహిళలు మరియు పలువురు ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గౌరవ అధ్యక్షులు వాసాల రాజు పటేల్, అధ్యక్షులు గాజుల మహేందర్ పటేల్, ప్రధాన కార్యదర్శి బత్తుల రవి పటేల్, కోశాధికారి మంగళరాపు చిన్న తిరుపతి పటేల్, కమిటీ సభ్యులు తాడేం మహేందర్ పటేల్, సాధన వేణి రాజు పటేల్, మంగళరాపు రజనీకాంత్ పటేల్, దేవులపల్లి బాలరాజు పటేల్, సుంకరి చందు పటేల్, కొలిపల్లి సతీష్ పటేల్, కాశెట్టి రమేష్ పటేల్, సుంకరి ఆంజనేయులు పటేల్ తమ పదవుల బాధ్యతలను స్వీకరించి ప్రమాణ స్వీకారం చేశారు. సంఘ అభివృద్ధి, సమాజ ఐక్యత మరియు సేవా కార్యక్రమాల విస్తరణ కోసం కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. సమాజంలోని విద్యార్థులకు విద్యా సహాయం అందించడం, పేద కుటుంబాలకు ఆర్థిక సహకారం అందించడం, యువతకు ఉపాధి మరియు నైపుణ్యాభివృద్ధిపై మార్గదర్శనం చేయడం, సమాజ ఐక్యతను మరింత బలోపేతం చేయడం తమ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆరోగ్య శిబిరాలు, విద్యార్థులకు స్కాలర్షిప్లు, యువతకు కెరీర్ మార్గదర్శక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖులు నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మున్నూరు కాపు సంఘం సమాజ అభివృద్ధికి చేస్తున్న సేవలను అభినందించారు. సంఘ సభ్యులు ఐక్యంగా కలిసి పనిచేస్తే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత పటేల్, మున్నూరు కాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తం పటేల్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వాసాల వెంకటేశ్వర్లు పటేల్, మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి మంగళారపు



లక్ష్మణ్ పటేల్, గ్రేటర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఆర్.వి. మహేందర్ పటేల్, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాదాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి. జగదీశ్వర్ గౌడ్, కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్, జర్నలిస్ట్ ఫోరమ్ అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్, శేరిలింగంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింగరావు పటేల్,గ్రేటర్ హైదరాబాద్ మున్నూరు కాపు వర్కింగ్ ప్రెసిడెంట్ పెరుక రమేష్ పటేల్, హఫీజ్పేట్ మున్నూరు కాపు సంఘం మాజీ అధ్యక్షులు, గౌరవ అధ్యక్షులు పోగుల సత్యనారాయణ పటేల్, కూనవేణి రమేష్ పటేల్, మంగళరాపు తిరుపతి పటేల్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, మహిళా సభ్యులు, యువజన ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సంఘ నాయకులు అతిథులకు మరియు హాజరైన సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



## ఉల్లాసంగా.. ఉత్సాహంగా

## అలరించిన విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు

**చదువుతోనే సమాజంలో మార్పు**

**ఆర్ బీవిఆర్ఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జె.అచ్యుత దేవి**



హైదరాబాద్, మార్చి 5: విద్యార్థులు డ్యాన్స్ లతో హోరెత్తించారు. ఆడిపాడి సందడి చేశారు. నారాయణగూడ లోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాలలో ఎకోస్ ఉత్సవ్ పేరిట నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. మణిపూరి నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలతో విద్యార్థులు అందరిలో ఉత్సాహాన్ని నింపారు. కాళాశాలలో నిర్వహించిన ఈ వేడుకలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జె. అచ్యుతదేవి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకున్నప్పుడే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని అన్నారు. ప్రస్తుతం విద్యా, ఉపాధి రంగాల్లో నైపుణ్యాభివృద్ధి అనేది ఎంతో కీలకమైందని విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు శోధనా సామర్థ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.ముత్యంరెడ్డి, ప్రొఫెసర్ సుదర్శన్ రెడ్డి, డాక్టర్ సుమిత్ర జైస్వాల్, కె.సింధూరి, అద్విత, అన్నపూర్ణ, విధి సజ్జా, జ్యోష్నా, బి.ప్రవల్లిక, హరిత, తదితరులు పాల్గొన్నారు.

# కరాటేను జాతీయ క్రీడగా అభివృద్ధి చేయాలి

## సమురాయ్ ప్రొఫెషనల్ కరాటే వ్యవస్థాపకులు క్యోషి సిద్ధార్థ్ షా




హైదరాబాద్, మార్చి 05: కాచిగూడ లోని శాంతి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సమురాయ్ ప్రొఫెషనల్ కరాటేలో గురువారం నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష విజయవంతంగా జరిగింది. సమురాయ్ ప్రొఫెషనల్ కరాటే వ్యవస్థాపకుడు అండ్ డైరెక్టర్, ఇండియా స్టైల్ చీఫ్ అయిన క్యోషి సిద్ధార్థ్ షా మార్గదర్శకత్వంలో విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇవ్వబడింది. గ్రేడింగ్ పరీక్షలో మొత్తం 54 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో వైట్ బెల్ట్ నుండి ఎల్లో బెల్ట్ వరకు 24 మంది విద్యార్థులు, ఎల్లో బెల్ట్ నుండి ఆరెంజ్ బెల్ట్ వరకు 30 మంది విద్యార్థులు ఉన్నారు.

గ్రేడింగ్ పరీక్షను కిక్కర్స్ మార్షల్ ఆర్ట్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ గ్రాండ్ మాస్టర్ చీఫ్ ఎగ్జామినర్ మాస్టర్ బి. నాగరాజ్ మార్గదర్శకత్వంలో నిర్వహించారు. పరీక్ష సమయంలో, విద్యార్థులు తమ క్రమశిక్షణ, నైపుణ్యం, మార్షల్ ఆర్ట్స్ పట్ల అంకితభావాన్ని ప్రదర్శిస్తూ, కటా, దాడులు, కిక్లు, బ్లాక్లు, పంచ్లు, ఆయుధ శిక్షణ, స్పారింగ్ వంటి వివిధ కరాటే విన్యాసాలు ప్రదర్శించారు. ఫైటర్స్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఎగ్జామినర్ మాస్టర్ కె. కార్తీక్ పరీక్షను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుచ్చి మిత్ర మండల్ ట్రస్టీ, వర్కింగ్ కమిటీ సభ్యుడు, శాంతి ప్రాథమిక పాఠశాల కరస్పాండెంట్ విపుల్ నిసార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంచలిత్ శాంతి ప్రాథమిక పాఠశాల సహ-కరస్పాండెంట్ పూనమ్ దేధియా హాజరయ్యారు.

బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష విద్యార్థులు కరాటే శిక్షణ పట్ల వారి పురోగతి, నిబద్ధతను ప్రదర్శించడానికి ఒక అద్భుతమైన వేదికను అందించింది. తల్లిదండ్రులు, అతిథులు విద్యార్థుల ప్రయత్నాలను, పరీక్ష సమయంలో ప్రదర్శించిన క్రమశిక్షణను ప్రశంసించారు. సమురాయ్ ప్రొఫెషనల్ కరాటే వ్యవస్థాపకులు, ఇండియా స్టైల్ చీఫ్ క్యోషి సిద్దార్థ్ షా మాట్లాడుతూ.. ఆత్మరక్షణకు దోహదపడే కరాటేను జాతీయ క్రీడగా అభివృద్ధి చేయాలని అన్నారు. కరాటేకు దేశ వ్యాప్తంగా ప్రజల నుంచి మంచి ఆదరణ ఉందని ఆయన తెలిపారు. బాలలు, యువతీ, యువకులు, మహిళలు తమ ఆత్మరక్షణ కోసం కరాటేను నేర్చుకోవాలని సూచించారు. నిరంతర సాధన ద్వారా కరాటేలో ప్రావీణ్యం సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు.

# PVYS తెలంగాణ ఆధ్వర్యంలో POLYCET -2026 మోడల్ టెస్ట్ పోస్టర్ విడుదల

## మార్చి 8న మంచిర్యాలలో మెగా గ్రాండ్ మోడల్ టెస్ట్ - విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు









మంచిర్యాల:(వాయిస్ టుడే న్యూస్) : పటేల్ విద్యార్థి యువజన సంఘం (ప్రామ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రామ్‌జజు--2026 మెగా గ్రాండ్ మోడల్ టెస్ట్ కు సంబంధించిన పోస్టర్‌ను ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. మంచిర్యాల కార్పొరేషన్ తొలి మేయర్ దర్నీ మధుకర్, మంచిర్యాల అదనపు కలెక్టర్ జి. శ్రీనివాస్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ మోడల్ టెస్ట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా నీరటి రామ్ ప్రసాద్ పటేల్ మాట్లాడుతూ గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు ప్రామ్ ఎప్పటికప్పుడు విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రామ్‌జజు పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష విధానం, ప్రశ్నల స్థాయి, సమయ నిర్వహణ వంటి అంశాలపై ముందస్తు అనుభవం పొందేందుకు ఈ మోడల్ టెస్ట్ మంచి అవకాశం అవుతుందని అన్నారు.

మార్చి 08, 2026న ఉదయం 11 గంటలకు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని వాగ్దేవి డిగ్రీ కాలేజ్, ఐబి చౌరస్తా వద్ద ఈ మోడల్ టెస్ట్ నిర్వహించబడనుందని తెలిపారు. పాలిటెక్నిక్‌లో చేరాలని ఆశిస్తున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో పాల్గొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు. అలాగే పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, ఉన్నత విద్యపై మార్గదర్శనం కూడా అందించనున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రామ్ నాయకులు జాబు ఆశిష్ కుమార్ పటేల్, అక్షిత్, ఆదిత్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్,మార్చి05(వాయిస్ టుడే):ఈనెల 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు జిల్లాలో చేపట్టనున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమ నిర్వహణకు జిల్లాలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై గురువారం కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐదు దశల్లో 99 రోజులపాటు "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమ నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సంసిద్ధం కావాలన్నారు.శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఏప్రిల్ 2న గ్రామస్థాయిలో గ్రామసభలు నిర్వహించాలని తెలిపారు.ఏప్రిల్ 16న మండల స్థాయి,మే 2న నియోజకవర్గ స్థాయి, మే 22న జిల్లాస్థాయిలో కార్యక్రమాలు ఉంటాయని అన్నారు.ఈ సభల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేకూరుస్తున్న లబ్ధి, వివిధ పథకాల గురించి వివరించాలని తెలిపారు. శాఖల వారీగా 10 వారాలపాటు అమలు చేసే ప్రత్యేక కార్యాచరణను పరిశీలించి పలు సూచనలు చేశారు.శాఖల వారీగా 10 రకాల అంశాలతో 99 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి ప్రణాళిక శాఖ నోడల్ గా వ్యవహరిస్తుందని తెలిపారు.గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైల్ క్లియరెన్స్, ఆరోగ్యం,అరైవ్ అలైవ్, సంక్షేమం,పిల్లల భద్రత మత్తు పదార్థాల నిర్మూలన,రైతు సంక్షేమం వ్యవసాయం, విద్య,యువత క్రీడలు, మహిళలు పర్యావరణం అంశాల్లో నిర్వహించిన కార్యక్రమాలపై యాక్షన్ ప్లాన్ ను పరిశీలించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే,లక్ష్మి కిరణ్,ఆర్డీవో మహేశ్వర్,ముఖ్య ప్రణాళిక అధికారి రామ్ దత్తారెడ్డి, జడ్పీ సీఈవో శ్రీనివాస్,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)తో విద్యార్థుల బంగారు భవిష్యత్తు

### కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్(దిలీప్)కుమార్



జమ్మికుంట మార్చి 5 (వాయిస్ టుడే): కరీంనగర్ జిల్లాలోని మొట్టమొదటిసారిగా జమ్మికుంట సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏ ఐ) ల్యాబ్ ను గురువారం జమ్మికుంట మున్సిపల్ నూతన చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్(దిలీప్) ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహన పెంపొందించుకొని తమ ప్రతిభను అభివృద్ధి చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కప్ కోడర్ సీఈఓ తిరుపతి నాయుడు విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క ఉపయోగాలు మరియు భవిష్యత్తులో దాని ప్రాధాన్యం గురించి వివరంగా తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సునీల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల యొక్క భవిష్యత్తు నాకు ముఖ్యమని వారి కోసం ఎంత ఖర్చైనా చేసి వారి బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దడానికి నేను ముందంజలో ఉంటానని, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా తల్లిదండ్రులు పాఠశాలకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సాంకేతిక విద్యపై ఆసక్తిని పెంచి కొత్త ఉత్సాహాన్ని నింపిందని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో కబ్ కోడర్ సంస్థ సీఈవో తిరుపతి నాయుడు, పాఠశాల కరస్పాండెంట్ సునీల్ కుమార్, డాక్టర్ పి. సంపత్ రావు, (ట్రాస్మా) మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి న్యూ మిలియన్ స్కూల్ కరస్పాండెంట్, ఆల్ రౌండర్ డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు), పాస్టర్ ఆనంద్ ,ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది.

# చీకటి ఒప్పందాల నాయకులను సస్పెండ్ చేయాలి

### మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి కారణమయ్యారు

### కాకిరాల, కిశోర్ రెడ్డి తీరుపై డాక్టర్ సోమేశ్వరరావు ధ్వజం



తొర్రూరు, మార్చి 5 వాయిస్ టుడే : కాంగ్రెస్ లో కొనసాగుతున్నట్లు నటిస్తూ బీఆర్ఎస్ పార్టీతో చీకటి స్నేహం చేస్తున్న నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ పొనుగోటి సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలోని డాక్టర్ సోమేశ్వరరావు నివాసంలో గురువారం కాంగ్రెస్ మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు వారి ఓటమికి గల కారణాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ సోమేశ్వర రావు మాట్లాడుతూ.. తొర్రూరు మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులుగా బరిలో నిలిచి శక్తి వంచన లేకుండా పోరాడామని, ఇరువురు పార్టీ ద్రోహులు బీ ఆర్ ఎస్ తో కుమ్మక్కై పార్టీ అభ్యర్థుల ఓటమికి కారణమయ్యారన్నారు.

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీ పీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిలు దృష్టి సారించడంతో నియోజకవర్గంలో ఎలాంటి భూ, ఇసుక, పోలీస్ సెటిల్మెంట్లు, ఇతర దందాలు జరగడంలేదన్నారు. దందాలకు, అక్రమ వసూళ్లకు, సెటిల్మెంట్లకు కేరాఫ్ గా నిలిచే ఇరువురు నాయకులకు అది మింగుడు పడలేదన్నారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ఎలాగైనా కాంగ్రెస్ పార్టీని బలహీనపరిస్తేనే తమకు అడ్డు ఉండదని భావించి ప్రతిపక్షంతో చేతులు కలిపి ఎన్నికల్లో అభ్యర్థుల ఓటమికి కారణమయ్యారని స్పష్టం చేశారు. ముమ్మాటికీ కాకిరాల హరిప్రసాద్, రామ సహాయం కిషోర్ రెడ్డిలది ద్రోహ చరిత్ర అని, అడుగడుగునా వెన్నుపోట్లు.. అనుక్షణం అబద్ధాలు.. వారి రాజకీయ ప్రస్థానమే ద్రోహాల పుట్ట అని దుయ్యబట్టారు. ద్రోహ బుద్ధి అనేది వారి డీఎన్ఏలోనే ఉందన్నారు. బీ ఆర్ ఎస్ కు కొమ్ముకాస్తూ, కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి కుట్రలు చేసినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయన్నారు.

తొర్రూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో తొమ్మిది స్థానాల్లో, పంచాయతీ ఎన్నికల్లో 7 స్థానాల్లో పార్టీ అభ్యర్థుల ఓటమికి కాకిరాల, కిషోర్ రెడ్డి లే కారణమన్నారు. వారికి బాధ్యత అప్పగించిన వార్డుల్లో, ఇతర వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించారన్నారు. వారి తీరు వల్ల పార్టీకి జరుగుతున్న నష్టం పై ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డిలకు వివరించామన్నారు. పలు గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను సర్పంచులుగా నిలిపి గెలిపించారని, వారిని కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులుగా చూపించే ప్రయత్నం చేశారన్నారు. మున్సిపల్ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి కారణమైన రామ సహాయం కిషోర్ రెడ్డి, కాకిరాల హరిప్రసాద్ లను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు.

దీనిపై కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ కు ఫిర్యాదు చేస్తామన్నారు. వారు పార్టీలో ఉండటం వల్ల పార్టీకి లాభం జరగకపోగా నష్టం ఎక్కువగా జరుగుతోందని, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తో హరి ప్రసాద్, కిషోర్ రెడ్డిలకు సంబంధాలు ఉన్నాయన్నారు. వీరు పెట్టిన అభ్యర్థులకు దయాకర్ రావు మద్దతు పలికాడని, దానికి సంబంధించిన వీడియో ఆధారాలు మా దగ్గర ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జలగం శ్రీనివాస్, చెవిటి సధాకర్, చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, పంజా కల్పన, తాళ్లపల్లి రమేష్ గౌడ్, సురేందర్ రాజు, జాటోత్ రవి నాయక్, వెంకన్న యాదవ్, వెన్నెం సోమిరెడ్డి, గూడెల్లి రామచంద్రయ్య, మోకాటి వెంకన్న, ధర్మారపు కిరణ్, వెంకట్ రెడ్డి, జిలుకర సురేందర్, తూర్పాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.




## వందేమాతరం విజేతలుగా న్యూ కౌటిల్యాస్ సెంట్ ఆమెన్ స్కూల్ విద్యార్థులు

వరంగల్ ( వాయిస్ టుడే ) మార్చి 05 : వందేమాతరం 150 వ జయంతి ఉత్సవాలను ను పురస్కరించుకొని భారత వికాస్ పరిషత్ వారు నిర్వహించిన వ్యాసరచన ,చిత్రలేఖనం, వకృత్వము వంటి పోటీలలో కరీమాబాద్ ప్రాంతానికి చెందిన న్యూ కౌటిల్యాస్ సెయింట్ అమెన్ హై స్కూల్ విద్యార్థులు పాల్గొని బహుమతుల ను గెలుచుకొన్నారు. ఎం పూర్వజ మౌల్య, పి యశ్వంత్, ఏ హాసిని (ప్రధమ) ,ఎం సాయి రూపిని ఎం ప్రకీర్తి ,కే సహస్ర సాయి ( ద్వితీయ),కే ప్రవర్ష,పి లాస్య ,కే మనస్విని (తృతీయ) బహుమతులను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కరస్పాండెంట్ కోడం శ్రీధర్ మాట్లాడుతూ వందేమాతరం భారత వికాస్ పరిషత్ వారు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో 8వ, 9వ, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇటీవల పోటీలను నిర్వహించారని మరియు విజేతలకు బుధవారం నాడు కాకతీయ యూనివర్సిటీ విసి ఆచార్య కే ప్రతాపరెడ్డి, మరియు బీవీపీ తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు నాగశేకర గుప్త గార్ల చేతుల మీదుగా బహుమతి ప్రధానోత్సవం జరిగిందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోడం సబిత మాట్లాడుతూపోటీ ఏదైనా యోగా, టాలెంట్ టెస్టులు,వ్యాసరచన,జ్ఞాపక శక్తి ,భగవద్గీత శ్లోకాలు, ఆటలు పాటల పోటీలు ఏవైనా తమ పాఠశాల విద్యార్థులు అలవోకగా విజయం సాధిస్తారని విద్యార్థులను కొనియాడారు...ఈ కార్యక్రమంలో కాజీపేట హనుమకొండ వరంగల్ ప్రాంత విద్యార్థులు పోటీలలో పాల్గొనగా తమ పాఠశాల విద్యార్థులు అన్ని విభాగాలలో బహుమతులను గెలుచుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## హార్ట్ పేషంట్ కళావతికి జీవీఎస్ ఫౌండేషన్ ఉచిత మందుల పంపిణీ

తొర్రూరు, మార్చి 5 వాయిస్ టుడే : గురువారం కేసముద్రం మండల ధన్నసరి గ్రామానికి చెందిన సుంచు సూరయ్య భార్య కళావతికి వీరి యొక్క సతీమణి గత రెండు సంవత్సరాల క్రితం ఓపెన్ హార్ట్ ఓపెన్ సర్జరీ జరిగింది. తర్వాత ఒక నెలకే తిరిగి మరొక సమస్య తలెత్తడంతో దానికి ఆపరేషన్ చేసేక్రమంలో బ్లడ్ ఎక్కించడం ఆ బ్లడ్ అనుకోకుండా ఒకవైపు ఎడమ కాలికి స్టోరేజ్ కావడం దాని వలన కాలు కింది భాగం అంతా ఇన్ఫెక్షన్ కావడం ఇక చేసేది ఏమీ లేక కాలును మోకాలు పైకి కట్ చేయడం జరిగింది. ఇంచుమించు ఆపరేషన్ కి మొత్తము 35 లక్షల వరకు ఖర్చయింది. ఇందుకు కొంతమంది దాతలు సహకరించారు. చాలావరకు అప్పులు చేసి ఈఆపరేషన్ చేయించడం జరిగింది . దానితోపాటు ఇప్పుడు అప్పులు, వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉంటున్న సూరయ్య తన సతీమణికి ప్రతి నెల హార్ట్ ప్రాబ్లమ్ తో ఉన్న ఆమెకు నెలకు 3500 మెడిసిన్ కచ్చితంగా జీవితాంతము వాడవలసి వచ్చింది. డాక్టర్స్ ఆదేశానుసారం ఒక్కరోజు కూడా మందులు ఆపడానికి వీలులేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నో ఇబ్బందుల్లో ఉన్నవీరు సహాయము కొరకు ఎదురుచూస్తూ మా జివిఎస్ ఫౌండేషన్ వివరాలు వాట్సప్, ఫేస్బుక్ లో చూసి మమ్మల్ని సంప్రదించారు. మేము వెళ్లి ఎంక్వయిరీ చేసి వారి యొక్క ఆర్థిక దీన పరిస్థితిని బట్టి మా యొక్క జి వి ఎస్ ఫౌండేషన్, హెచ్ఎఫ్ఎం ట్రస్ట్ కలిసి రెండు నెలలకు వారికి 6 వేల రూపాయల విలువ చేసే మందులు ఉచితముగా పంపిణీ చేయడం జరిగిందని. ఫౌండేషన్ వ్యవస్థాపకులు జి వెంకన్న (ఇశ్రాయేలు ) తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సెక్రటరీ జి సునీత, బోర్డు సభ్యులు పడిశాల జాన్ విక్టర్,ఎం.ప్రణయ్,బి.సతీష్, పూర్ణ చందర్ తదితరులు పాల్గొన్నారు. జీవితాంతం వాడవలసిన ఆ మందుల కొరకు ఇంకా దాతలు ముందుకు రావాలని ఆమెకు ఆర్థిక సహాయంతో మందులు పంపిణీ చేసి ఆదుకోవాలని స్వచ్ఛంద సంస్థలకు దాతలకు పిలుపునిచ్చారు. వివరాలకు జి వి ఎస్ ఫౌండేషన్ ను ఫోన్ నెంబర్ 9441739574 లో ప్రత్యక్షంగా సంప్రదించాలని కోరారు.



## ఇస్సార్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన పెను ప్రమాదం - విరిగిన రైలు ఇంజన్ చక్రం

### అప్రమత్తమైన పైలెట్ - రైల్వే అధికారుల సహాయక చర్యలతో ఊపిరి పీల్చుకున్న ప్రయాణీకులు

జమ్మికుంట మార్చి 5 (వాయిస్ టుడే): కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లి శివారులో ఇస్సార్ ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తృటిలో తప్పింది. రైలు ఇంజిన్ చక్రం విరిగిపోవడంతో గురువారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో రైలు అక్కడే నిలిచిపోయింది. ఈ ఘటనతో అప్రమత్తమైన రైల్వే అధికారులు అదే మార్గంలో వస్తున్న దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌ను ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. అనంతరం రైల్వే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. రైలులో ఉన్న ప్రయాణికులంతా సురక్షితంగా ఉండటంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై రైల్వే అధికారులు మరింత పరిశీలన చేపట్టినట్లు సమాచారం.



## చంటి బిడ్డతోనే విధి నిర్వహణ

**మాతృత్వానికి అడ్డు కాని సేవా భావం**

**పాల్వంచ మండలం బసవతారక కాలనీలో ఆధార్ ఆపరేటర్ భూక్యా వెన్నెలకు ప్రజల ప్రశంసలు**

పాల్వంచ మండలం మార్చ్ 5 ( వాయిస్ టుడే ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం బసవతారక కాలనీ గ్రామపంచాయతీ కార్యాలయంలోని ఆధార్ సేవా కేంద్రంలో పనిచేస్తున్న ఆధార్ ఆపరేటర్ శ్రీమతి భూక్యా వెన్నెల తన సేవా తత్వంతో అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఏడాది వయస్సు ఉన్న చంటి బిడ్డను ఒడిలో పెట్టుకొని కూడా విధి నిర్వహణ చేస్తూ ప్రజలకు ఆధార్ సేవలను అందించడం అక్కడికి వచ్చిన వారిని ఆకట్టుకుంటోంది. వెన్నెలకు ప్రస్తుతం ఏడాది వయస్సు ఉన్న చిన్నారి ఉండడంతో విధి నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో అదనపు ఆపరేటర్ యాక్టివేషన్ కోసం పై అధికారులకు దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఆ ప్రక్రియ పూర్తయ్యేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉండటంతో, అప్పటివరకు ప్రజలకు సేవలు ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఆమె చంటి బిడ్డతోనే ఆధార్ కేంద్రానికి వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. ఆధార్ సేవల కోసం కేంద్రానికి వచ్చిన ప్రజలు ఈ దృశ్యాన్ని చూసి భూక్యా వెన్నెల సేవా భావాన్ని అభినందిస్తున్నారు. తల్లితనం బాధ్యతలు ఉన్నప్పటికీ ప్రజా సేవను ముందుకు పెట్టి కష్టపడి పనిచేస్తున్న ఆమెను పలువురు ప్రశంసిస్తూ "మాతృత్వానికి విధి నిర్వహణ అడ్డు కాదు" అని పేర్కొంటున్నారు. బసవతారక కాలనీ గ్రామపంచాయతీ ఆధార్ సేవా కేంద్రంలో కనిపించిన ఈ సన్నివేశం సేవా భావం, బాధ్యత, తల్లితనం కలిసిన ఒక ప్రేరణాత్మక ఉదాహరణగా నిలుస్తోంది.



## ఖమ్మం జిల్లా అడవుల్లో కెమెరా ట్రాప్‌లకు చిక్కిన చిరుతపులి, ఎలుగుబంటి సంచారం

ఖమ్మం మార్చ్ 5 ( వాయిస్ టుడే): ఖమ్మం జిల్లాలోని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో అటవీ శాఖ ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్‌లలో ఇటీవల చిరుతపులి, మరియు ఎలుగుబంటి సంచారానికి సంబంధించిన దృశ్యాలు నమోదయ్యాయి. ఈ పరిణామం జిల్లాలోని అటవీ పర్యావరణ వ్యవస్థలో వన్యప్రాణుల ఆరోగ్యకరమైన జీవనానికి నిదర్శనంగా నిలుస్తోంది. వన్యప్రాణుల జనాభాను శాస్త్రీయంగా పర్యవేక్షించడానికి మరియు జీవవైవిధ్య నమూనాలను అర్థం చేసుకోవడానికి అటవీ శాఖ నిరంతరం కృషి చేస్తోంది. ఖమ్మం జిల్లా పరిధిలోని అడవుల్లో మెరుగైన ఆవాస పరిస్థితులు మరియు పర్యావరణ సమతుల్యత వల్లే ఈ వన్యప్రాణుల ఉనికి సాధ్యమైందని అధికారులు తెలిపారు. గడిచిన ఏడాది కాలంగా ఖమ్మం జిల్లాలో వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ శాఖ పలు కీలక చర్యలు చేపట్టింది. వేసవి కాలంలో వన్యప్రాణుల దాహం తీర్చడానికి అటవీ ప్రాంతాల్లో శాస్త్రీయ పద్ధతిలో నీటి కుంటల నిర్వహణ. సమస్యాత్మక అటవీ ప్రాంతాలలో 360-డిగ్రీల నిఘా కెమెరాల ఏర్పాటు. అడవుల్లో వేటను అరికట్టడానికి ముమ్మర తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడం. అడవుల పర్యవేక్షణ మరియు వన్యప్రాణుల కదలికలను గమనించడానికి సరికొత్త డ్రోన్ టెక్నాలజీని వినియోగించడం.

**పులిగుండల ఎకో-టూరిజం:**

ప్రకృతిపై అవగాహన పెంచడం మరియు స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించడం లక్ష్యంగా పులిగుండల ఎకో-టూరిజం ప్రాజెక్టును అభివృద్ధి చేయడం. అటవీ అంచున ఉన్న గ్రామాల ప్రజలు రాత్రి సమయాల్లో అడవిలోకి వెళ్లకూడదని, వన్యప్రాణుల ఆవాసాలకు ఇబ్బంది కలిగించవద్దని అటవీ శాఖ విజ్ఞప్తి చేస్తోంది. నివాస ప్రాంతాల సమీపంలో వన్యప్రాణుల సంచారం కనిపిస్తే వెంటనే సమీప అటవీ అధికారులకు సమాచారం అందించాలని కోరడమైనది. ఖమ్మం జిల్లా అటవీ సంపదను మరియు వన్యప్రాణులను కాపాడటంలో స్థానిక ప్రజలు తమ సహకారాన్ని కొనసాగించాలని శాఖ కోరుతోంది.

## కాలం చెల్లిన 108 వాహనంలో పేషేంట్ నరక యాతన



కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే) : ఉంగుటూరు మండలం ఎలుకాపాడు గ్రామానికి చెందిన ఒక పేషేంట్ 108 వాహనం లో నరకయాతన పడ్డారు. బాధితులు సమాచారం మేరకు ఎలుక పాడు కు చెందిన ఓ మహిళ అనారోగ్యంతో అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో 108 కి కాల్ చెయ్యగా ఉంగుటూరు లో గత కొంతకాలంగా నిరుపయోగంగా పడి ఉన్న 108 వాహనాన్ని తమ గృహానికి పంపించారు. 108 లో పరికరాలు లేవని,ఆక్సిజన్ సిలెండర్ లేదని ఆరోపించారు. అంతేకాకుండా మార్గం మధ్యలో దావాజీ గుడెం గ్రామ సమీపంలో వాహనము రోడ్డుపై ఆగిపోయింది. వెంటనే స్పందించిన స్థానికులు 108 వాహనాన్ని నెట్టడంతో మరలా తిరిగి స్టార్ట్ అయ్యింది. ఎట్టకేలకు నానా అవస్థలు పడి బాధితురాలిని చిన్న అవుటపల్లి లోని ఆసుపత్రికి తరలించారు. జరిగిన సంఘటన పై బాధితురాలి బంధువులు అధికారుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజా పాలనతో అభివృద్ధి దిశగా ప్రగతి ప్రణాళిక





సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా మార్చి-05 వాయిస్ టుడే : సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మీటింగ్ హాల్ యందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా పట్టణాలలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న తొంభై తొమ్మిది రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈనెల ఆరవ నుండి పన్నెండవ వరకు పట్టణంలోని వార్డుల వారిగా పరిసరాల పరిశుభ్రత,పెండింగ్ ఫైల్స్ పూర్తి చేయడం, సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా నీటి ఏద్దడి సమస్యలు పరిష్కరించుట, అమృత్ పైపు లైన్లు త్వరితగతిన పూర్తి చేయుట, చెరువులలో ఉన్నటువంటి ప్లాస్టిక్ వ్యర్థలను తొలగించుట, పబ్లిక్ టాయిలెట్లను,శుభ్రపరుచుటఇంటి పన్ను ల వసూలు, కాలం చెల్లిన వాహనాలను ఇతర వస్తువులను తొలగించుటకు, మున్సిపాలిటీ చేపడుతున్న కార్యక్రమంలో కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధా కృష్ణ, వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత, వార్డు కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ అసిస్టెంట్ ఇంజనీర్ రాజ్ కుమార్ తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## సాగర్ ప్రాజెక్టు పరిశీలించిన కె. జి. బి ఓ చీఫ్ ఇంజనీర్

నాగార్జునసాగర్, మార్చి, 5 : వాయిస్ టుడే : నాగార్జునసాగర్ ప్రాజెక్టును గురువారం నాడు కేంద్ర జల వనరుల సంఘం కృష్ణా గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్ ఎంఎస్ సహారే సందర్శించి పరిశీలించారు. దీనిలో భాగంగా నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం తెలియజేసే ప్రాంతాన్ని, డ్యాం క్రస్ట్ గేట్ల విభాగాన్ని, కంట్రోల్ రూమ్ లను పరిశీలించారు. వీరికి సాగర్ ప్రాజెక్ట్ ఇంజనీర్లు ఆండాలు, కృష్ణయ్య, సత్యనారాయణలు కేంద్ర జల వనరుల సంఘం చీఫ్ ఇంజనీర్ కి వివరించారు. అనంతరం టెలిమెట్రి విధానాన్ని పరిశీలించారు. అనంతరం వీరు నాగార్జునసాగర్ లోని బుద్ధవనాన్ని సందర్శించారు. బుద్ధ చరిత వనంలోని బుద్ధుని పాదాలు వద్ద పుష్పాంజలి ఘటించి వందనం సమర్పించారు. అనంతరం బుద్ధ చరితవనం, ధ్యానవనం, స్తూప వనాలను వీక్షించారు. మహా స్తూపం లోని ధ్యాన మందిరంలో బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రులు వీరిచే బుద్ధ జ్యోతులను వెలిగించిన అనంతరం బుద్ధవనం కండువాలతో సత్కరించారు. సాగర్ సందర్శనలో భాగంగా నాగార్జునకొండ మ్యూజియాన్ని అక్కడ నిర్మించిన పునర్నిర్మిత కట్టడాలైన అశ్వమేద యజ్ఞశాల, మహాస్తూపం,సింహాల విహారాన్ని సందర్శించారు. వీరికి స్థానిక టూరిజం గైడు సత్యనారాయణ నాగార్జునసాగర్ ప్రాజెక్టు, బుద్ధవనం, నాగార్జునకొండ చారిత్రక విశేషాలను వివరించారు. వీరితోపాటు( సి డబ్ల్యూ సి )కేంద్ర జల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధీరజ్ సింఘాల్, జె. ఇ. ఉమా శంకర్ తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌కి గ్రామస్తుల కృతజ్ఞతలు



కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే) : ఉంగుటూరు మండలం ఓంద్రంపాడు గ్రామంలో ఎప్పటినుంచో అపరిష్కృతంగా ఉన్న జిల్లా పరిషత్ రోడ్డుకు ఎనర్జియస్ ద్వారా నిధులు మంజూరు చేసి తారు రోడ్ ని నిర్మాణం పూర్తి చేయించి గ్రామస్తుల రహదారి ఇబ్బందులు తొలగించిన గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కి ఓంద్రంపాడు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. గత 16 ఏళ్లుగా ఈ రోడ్డు గుంటలు పడిపోయి ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడిన గ్రామస్తులకి తారు రోడ్డు నిర్మాణంతో సుఖవంతమైన ప్రయాణానికి అనుకూలంగా ఉండటంతో కూటమి ప్రభుత్వానికి స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ కు మరోసారి ధన్యవాదాలు తెలిపారు.

## బంగారం ఇస్తానని 9.6 లక్షలతో పరారీ

**- బట్టబయలైన ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్ బాగోతం**

**- అరెస్టు చేసిన పోలీసులు**



మిర్యాలగూడ మార్చి 5(వాయిస్ టుడే) : ఫైనాన్సులో తాకట్టు పెట్టిన బంగారాన్ని తక్కువ ధరకు ఇస్తానని చెప్పి 9 లక్షల 60 వేల రూపాయలతో పరారైన ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్ ను మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మీడియా సమావేశంలో డిఎస్పి రాజశేఖర్ రాజు వెల్లడించిన వివరాల ప్రకారం మిర్యాలగూడ పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్లో మేనేజర్ గా పని చేస్తున్న లోడంగి యాదగిరి తమ ఫైనాన్స్ లో బంగారం వేలం పాటకు వచ్చిందని తక్కువ ధరకే ఇప్పిస్తానని చెప్పి కస్టమర్లను నమ్మిస్తుండేవాడు. అందులో భాగంగా మిర్యాలగూడ పట్టణంలోని బంగారం షాపుకు చెందిన ఉపేంద్ర చారి వద్ద తొమ్మిది లక్షల 60 వేల రూపాయలను చెల్లిస్తే 12 లక్షల రూపాయల విలువ కలిగిన బంగారం అందజేస్తానని నమ్మబలికాడు. ఉపేంద్ర చారి అది నమ్మి యాదగిరి ఎకౌంటుకు డబ్బు పంపించగానే డబ్బుతో పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. బంగారం ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పట్టణంలోని వన్ టౌన్ పోలీసుల ఫిర్యాదు కాగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు డిఎస్పి తెలిపారు. గతంలో కూడా ఇదే విధంగా మోసాలకు పాల్పడినట్లు తెలిసిందన్నారు. యాదగిరి బెట్టింగ్ లకు అలవాటు పడి బ్యాంకుకు వచ్చిన కస్టమర్లను మోసం చేస్తున్నట్లు గుర్తించినట్లు డిఎస్పి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతిగా వ్యాపారం చేసుకోవాలి తప్ప అక్రమాలకు పోయి ఇబ్బందులు పడితే పోలీసులు బాధ్యత వహించరని హెచ్చరించారు. నిందితుడు నుండి నాలుగు లక్షల రూపాయలను రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. మీడియా సమావేశంలో వన్ టౌన్ సీఐ నాగభూషణరావు తదితరులున్నారు.

## విజ్ఞాన్‌లో ఆసక్తికరంగా క్విజ్ పోటీలు

ఇల్లందు, మార్చి 5 (వాయిస్ టుడే) : పాఠశాలల్లో నిర్వహించే వక్తృత్వ, క్విజ్ పోటీలు విద్యార్థుల ప్రతిభాపాటవాలను వెలికితీస్తాయని సీనియర్ జర్నలిస్ట్ ఎస్ వి.సూర్య నారాయణ పేర్కొన్నారు.ఇల్లందులోని విజ్ఞాన్ విద్యా సంస్థలో గురువారం విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ప్రతిభా పాటవాలను పెంపొందించడానికి, బహుముఖ వికాసానికి, పోటీతత్వానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ పోటీలలో బహుమతులు సాధించాలనే ఆసక్తితో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం ప్రశంసనీయమని పేర్కొంటూ ప్రతిరోజు రెగ్యులర్ బోధనకు తోడుగా విద్యార్థులను ఈ పోటీప్రపంచంలో ముందుంచేందుకు తరచుగా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్న యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఇల్లందులో బొగ్గును కనుగొన్నది ఎవరు, సింగరేణి కాలరీస్ రైల్వే స్టేషన్ ను ఏ సంవత్సరంలో స్థాపించారు, సింగరేణి ఆవిర్భావ దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటాము, ఇల్లెందును పూర్వం ఏమని పిలిచేవారు, ఇల్లెందు లో గల ప్రాచీన గ్రంథాలయం పేరేమిటి తదితర అనేక ఆసక్తికరమగు ప్రశ్నలకు విద్యార్థులు సమాధానాలు చెప్పారు. విజ్ఞాన్ ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తూ వారు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# వెలుగుమట్ల భూదాన భూములపై సమగ్ర దర్యాప్తు చేయాలి

**బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ శీలం పాపారావు**



ఖమ్మం, మార్చి 5 (వాయిస్ టుడే): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన వెలుగుమట్ల భూదాన భూములలో తెల్లవారుజామున సుమారు నాలుగు వేలమంది పోలీసులను మోహరించి తీవ్రవాదులను ముట్టడించినట్టు అమాయక పేదలను ముట్టడించి వారీ ఇండ్లను ధ్వంసం చేసి , పేదల ను తరిమి వేసిన కుతంత్రంలో జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులే కాకుండా జిల్లా ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం కూడా బాధ్యత వహించాలని అదేస్థలం లో తిరిగి వారికి శాశ్వత గృహనిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేవలం వెలుగుమట్ల భూదాన భూముల విషయమే కాకుండా ఖమ్మం ఉమ్మడి జిల్లాలో గల మొత్తం భూదాన భూముల వివరాలను శ్వేత పత్రంలో ప్రకటించి , నిజాలను వెల్లడించాలని బిజెపి రాష్ట్ర నాయకులు ప్రముఖ సర్జన్ డాక్టర్ శీలం పాపారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటివరకు వెలుగులో వచ్చిన అనేక అంశాలను పరిశీలిస్తే ఎక్కడ కూడా మొత్తం నిజాలు బయటకు రాలేదని తెలిపారు. వెలుగుమట్ల భూదాన భూములు 62.6 ఎకరాల విస్తీర్ణం లో ఉన్నాయని , మంత్రులు అధికారులు కేవలం 31 ఎకరాలకు సంబంధించిన విషయాలు మాట్లాడుతున్నారని మిగతా ఎకరాల విషయం ప్రస్తావించడం లేదని దీని వెనుక కారణాలు ఏమిటని ప్రశ్నించారు. ఈ భూదాన భూములు పేదలకు మాత్రమే ధారాధాత్తం చేయాలని , ప్రభుత్వం తన అవసరాలకు ఏమాత్రం వాడుకోకూడదని పేర్కొన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటే పేదల ప్రభుత్వమని గొంతు చించుకొని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం స్వయంగా భూదాన భూములనుండి పేదలను బలవంతంగా ఖాళీ చేయడం అమానుషం , అవమానియం అని డాక్టర్ శీలం పాపారావు మండిపడ్డారు. అదేవిధంగా అనేక పార్టీలు , పేదల పార్టీలు అనబడే కమ్యూనిస్టు పార్టీలు కూడా ప్రస్తుతం ఆరోపణలు విమర్శలకు కేంద్రంగా మారడం అంటే .... వారు కూడా ఈ కుట్రలో భాగస్వాములనీ భావించాల్సి వస్తుందని చెప్పారు. నిజంగా బీఆర్ఎస్ పార్టీకి ,ఆ పార్టీ పెద్దలకు పేద ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఈ సమస్యను వారి ప్రభుత్వం ఉన్నప్పుడే పరిష్కరించేవారు అని గుర్తు చేశారు. గతంలో దీ=నా పార్టీ అధికారం లో ఉన్నప్పుడు గోళ్లపాడు ఛానల్,మమతా రోడ్ చీప్రా స్థలాలలో లో ఉన్న ఎన్నో వందల పేదల ఇండ్లు కూల్చి ఆ స్థలాలను బడా బాబులకు కట్టబెట్టి ఇప్పుడు ఈ విషయంపై మాట్లాడటం,అక్కడ ఇల్లు కట్టి నిర్మించి ఇస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో 58 , 59 జీవోలను అనుసరించి పెద్దలకు వారు ఆక్రమించుకున్న భూములకు క్రమబద్ధీకరించిన టిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వం ఈ పేదలు ఎందుకు గుర్తు రాలేదని ప్రశ్నించారు. గత బి ఆర్ స్ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న వాడు నేడు కాంగ్రెస్ ప్రభుత్వం లో మంత్రులుగా చలామణి అవుతున్న ఇద్దరికీ , డిప్యూటీ సీఎం గా ఉన్నవారికి వెలుగుమట్ల భూదాన భూముల గురించి తెలియదా ? పేదలు అక్కడ నివాసముంటున్న విషయము సైతం తెలియదు అంటే ఎవరు నమ్మలేరని అన్నారు. దీనిపై ప్రజా ఆందోళన పెరగక ముందే ఎక్కడైతే తొలగించబడ్డారో పేదలు అక్కడే వారికి ప్రభుత్వం డబుల్ బెడ్ రూములు నిర్మించి ఇవ్వాలని , ఆ ఈ రాష్ట్రప్రభుత్వానికి పేదలపై చిత్తశుద్ధి ఉంటే మిగతా 30 ఎకరాల లో ఉన్న బడా బాబుల ఆక్రమణలు తొలగించి వాటిని పేద ప్రజలకు పంచాలని డిమాండ్ చేశారు.



# అంగరంగ వైభవంగా నాగులమ్మ మహా జాతర

**భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తజనం**

**గిరిజన నృత్యాలతో , ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణ**

**రాజుపేట సెంటర్‌లో వనదేవతకు నాగులమ్మ కుఎదురుకొలు**

ములుగు జిల్లా బ్యూరో మార్చ్ 5 (వాయిస్ టుడే) : మంగపేట మండలం వాగొడ్డుగూడెం గ్రామ పంచాయతీ పరిధి లో గల లక్ష్మీ నర్సాపూర్ గ్రామం లో నాగులమ్మ జాతర మూడో రోజు రోజు గురువారం రోజున పూజారులు వడ్డెలు పాలమాకు వొర్రె వొద్ద కంకవనానికి పూజలు చేసి సాయంత్రం రాజుపేట సెంటర్ నందు నాగులమ్మ అమ్మవారితో ఎదురుకోలు జరిపారు.ఎదురుకొలు చూడటానికి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదిలాబాద్ కు చెందిన ఆదివాసీ గుస్సాడి నృత్యం,తూర్పు గోదావరి జిల్లా చింతూరు గ్రామానికి చెందిన ఆదివాసీ ధింసా నృత్యం జాతరలో ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాయి.రాత్రి 12:05 నిమిషాలకు నాగులమ్మ పగిడిద్ద రాజుల కళ్యాణ మహోత్సవం ఆదివాసీ సాంప్రదాయ బద్ధంగా నిర్వహించనున్నారు. అనంతరం 3 గంటలకు లోక కళ్యాణార్థం బాడిశ రామకృష్ణ స్వామిజీ అగ్నిగుండంలో నడవడం జరుగనున్నది.ఆలయ ధర్మకర్త,మెనిజింగ్ ట్రస్టీ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామి ,పూజ కార్యక్రమాలను పర్యవేక్షించగా నాగులమ్మ ఆలయ ప్రధాన పూజారి బాడిశ నాగరమేష్ ఆధ్వర్యం లో పూజలు నిర్వహించగా పూజారులు సోడి సత్యం,కుర్సం పుల్లయ్య, కట్టం సమ్మక్క,చౌళం భవాని,మడకం సుప్రజ,పోలిశెట్టి స్వరూప,వడ్డెలు కోర్స శ్రీకాంత్ ,మూయబోయిన శివ,తుర్స చిన్నబ్బాయి,కారం రాజేష్ పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి కులపెద్దలు కుర్సం విష్ణుమూర్తి,మడకం రాజేశ్వర్ రావు,చౌళం వెంకటేశ్వర్లు ,కొమరం మాధవ రావు,కొమరం పాపారావు,ఇరప రామకృష్ణ,ఇందారపు రమేష్ పాల్గొన్నారు.



# రామవరప్పాడు సర్పంచ్ సస్పెండ్

## రూ. 4.04 కోట్ల గోల్మాల్ అయినట్లు నిర్ధారణ



కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): రామవరప్పాడు పంచాయతీలో రూ.4.04 కోట్ల అక్రమాలు జరిగినట్లు అధికారుల విచారణలో బట్టబయలైంది. అధికారులను, సర్పంచ్ ని బాధ్యులను చేస్తూ తొలుత సర్పంచ్ ని పదవి నుంచి తొలగిస్తూ కలెక్టర్ లక్ష్మీశ బుధవారం ఉత్తర్వులు వెలువరించారు. ఉప సర్పంచికి బాధ్యతలు ఇవ్వనున్నారు. అక్రమాల వేళ విధుల్లో ఉన్న కార్యదర్శులు, ప్రత్యేక అధికారుల పైనా చర్యలకు రంగం సిద్ధమైంది.

**అడ్డగోలు దోపిడీ.....**

పంచాయతీలో 2018-2025 వరకు సాధారణ నిధుల్లో రూ.3.01 కోట్లు, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.1.03 కోట్లు దుర్వినియోగం చేశారు. అప్పటి కార్యదర్శి రామ్మోహన్ రావు, ప్రత్యేక అధికారులైన ఇరిగేషన్ ఏ.ఈ కొండ, ఎంపీడీవో సునీత, ప్రస్తుత సర్పంచ్ శ్రీదేవిని బాధ్యులుగా పేర్కొన్నారు. సర్పంచ్ వాటాగా రూ.1,64,31,758 చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మిగిలిన మొత్తాన్ని అధికారులు భరించాల్సిందే.

2018-19లో సాధారణ నిధుల నుంచి అప్పటి,ఏఈ, కార్యదర్శి కలిసి రూ.6.19 లక్షలు పక్కదారి పట్టించారు. 2019-21 మధ్య కార్యదర్శి,అప్పటి విజయవాడ గ్రామీణ ఎంపీడీవో కుమ్మక్కయి రూ.62.9 లక్షలు మింగేశారని ఆరోపణ 2019-2025 వరకు రూ.2.3 కోట్లు కార్యదర్శి,సర్పంచ్ కలిసి దుర్వినియోగం చేశారు. 2019-2021మధ్య 15వ ఆర్థిక సంఘం నిధుల్లో కార్యదర్శి, ఎంపీడీవో రూ.6.6 లక్షలు స్వాహా చేశారు. 2021-25 మధ్య సర్పంచ్, కార్యదర్శి కలిసి మరో రూ.96 లక్షలు మళ్లించారని నివేదించారు.

**మరి వీటిమాటేంటి?:**

పెనుగంచిప్రోలు, ముక్త్యాల పంచాయతీల్లో రూ.8 కోట్లకుపైగా అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు అందాయి. అధికారుల విచారణలో అక్రమాలు తేలగా బాధ్యులకు నోటీసులు అందించారు. వారికిచ్చిన గడువు పూర్తయినా చర్యలు లేవు.రాజకీయ ఒత్తిళ్లతోనూ అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారు. నెల రోజుల్లో సర్పం చుల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో వేగంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయం.



# ప్రభుత్వ పాఠశాలలో విద్యా సామగ్రి పంపిణీ చేసిన పోలీస్ బృందం

ఝరాసంగం మార్చ్ 05 (వాయిస్ టుడే): నాగిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గ్రామ యువత ఆధ్వర్యంలో విద్యార్థులకు టై, బెల్ట్, పుస్తకాలు, పెన్సిల్స్, పెన్సలను జహీరాబాద్ సీఐ శివలింగం, ఎస్ఐ నరేష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ శివలింగం మాట్లాడుతూ --- "నాగిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఈ విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమానికి రావడం ఆనందంగా ఉంది. విద్యార్థులను చిన్న వయసులోనే ప్రోత్సహించడం అత్యంత అవసరం. వారు భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలి" అని తెలిపారు. అలాగే ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ --- "విద్యార్థులే భవిష్యత్తు. వారు ఉన్నత స్థాయికి ఎదిగి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ న్యాలకంటి రాజేశ్వరి సురేష్, ఉపసర్పంచ్ దశరథ్, పాఠశాల అధ్యాపకులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అప్పుల బాధ భరించలేక భార్యా భర్తల ఆత్మహత్యాయత్నం

మహబూబ్నగర్ జిల్లా ఫిబ్రవరి 5 (వాయిస్ టుడే) జడ్చర్ల /నవాబుపేట : మండల పరిధిలోని జంగమయ్యపల్లి గ్రామంలో గురువారం తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన మురుగని రవి (25 ) ఆయన భార్య మురుగని లావణ్య (22) తమ వ్యవసాయ పొలం దగ్గర గల చింత చెట్టుకు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యయత్నం చేసుకున్నారు. రవి భార్య లావణ్య అక్కడికక్కడే మృతి చెందగా.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రవిని మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో ప్రస్తుతం చికిత్సలు పొందుతున్న రవి ప్రస్తుతం చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ఆయన పరిస్థితి కూడా విషమంగానే ఉన్నది. ఈ సంఘటనకు సంబంధించి జంగమయ్యపల్లి గ్రామస్తులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఇటీవల రవి గృహ నిర్మాణం కోసం గేదెల కొనుగోలు కోసం అప్పులు చేశాడు. అప్పులు అధికం కావడంతో బుధవారం రాత్రి ఆయన తల్లి పద్మమ్మ అప్పుల విషయమై రవిని తీవ్రంగా మందలించింది. దీంతో తీవ్ర మనస్థాపానిగురైన రవి తనతో పాటు తన భార్య లావణ్యను 11 నెలల వయసు గల తన కూతురును వెంట తీసుకుని తమ గ్రామ సమీపంలో గల వ్యవసాయ పొలంలోని పశువులపాకలో నిద్రించాడు. గురువారం తెల్లవారిన తర్వాత సమీపంలోని కొల్లూరు గ్రామానికి వెళ్లి టిఫిన్ పార్సిల్ తెచ్చుకొని భార్యాభర్తలు భుజించారు. అనంతరం కొంతసేపు భార్యాభర్తలు చర్చించుకొని చివరకు తమకు చావే శరణ్యమని భావించి, తమ వెంట తీసుకెళ్లిన కూతురును ఉయ్యాలలో పరుండబెట్టి చెట్టుకు ఉరి తాళ్లు బిగించుకున్నారు. గొంతులకు ఉరి తాళ్లు బిగించుకున్న తర్వాత రవి హైదరాబాద్ పట్టణంలో ఉంటూ జీవనోపాధి పొందుతున్న తన తమ్ముడు ఆనంద్ కు వీడియో కాల్ చేసి తాము ఇక బ్రతకలేమని అందువల్ల ఉరివేసుకొని చనిపోతున్నామని చెప్పి కాళ్ల క్రింద ఉన్న డ్రమ్ములను తోసి వేశాడు. దాంతో హైదరాబాద్ పట్టణంలో ఉన్న ఆనంద్ తమ గ్రామస్తులకు ఫోన్ ద్వారా విషయం తెలిపి తమ వ్యవసాయ పొలం దగ్గరకు వెళ్లి తన అన్న వదినలను కాపాడాలని అభ్యర్థించాడు. గ్రామస్తులు అక్కడికి చేరుకునే లోపే ఉరితాడు బిగుసుకుపోయిన లావణ్య మృతి చెందింది. రవి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా ఆయనను వెంటనే మహబూబ్ నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రవి పరిస్థితి విషమంగా ఉంది. లావణ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్ నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితుల నుంచి ఇంకా ఏ విధమైన ఫిర్యాదు అందలేదని ఎస్సై విక్రమ్ తెలిపారు.



# అల్లాడి వీరేశంకు " దాన విశారద "బిరుదు

**ప్రకటించిన రంభపురి జగద్గురు - అందించిన పీఠాధిపతులు**

ఝరాసంగం మార్చ్ 05 (వాయిస్ టుడే): జహీరాబాద్ పట్టణ ప్రముఖ వ్యాపారవేత, దత్తగిరి మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం గుప్త కు భక్తి సేవలను గుర్తించి కర్ణాటక రంభపురి వీరసింహాసన మహాసమస్థాన పీఠం జగద్గురు. శ్రీ శ్రీ శ్రీ ప్రసన్న రేణుకా వీరసోమేశ్వర శివాచార్య స్వామీజీ దాన విశారద అనే బిరుదును ప్రకటించారు. గురువారం బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో జరిగిన ఆదిశంకరాచార్యుల విగ్రహావిష్కరణ సందర్భంగా వారి తరపున తడోల్ ఆశ్రమ పీఠాధిపతి రాజేశ్వర శివాచార్య స్వామీజీ, బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం పీఠాధిపతి వైరాగ్య శిఖామని అవధూత గిరి మహారాజ్, సిద్దేశ్వరానందగిరి పత్రాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. "దాన విశారద" అనే బిరుదును ధార్మిక, విద్యా వైద్యం, ఆశ్రమాలు, దేవాలయాలు, విద్యాసంస్థల నిర్మాణం పేదలకు సహాయం చేసే వారిని గుర్తించి ఈ బిరుదులు ఇస్తారని జగద్గురు పీఠం వారి తరుపున రాజేశ్వర శివాచార స్వామీజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో , కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉజ్వల్ రెడ్డి, వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.





# సుల్తానాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆకస్మిక తనిఖీ - మందుల కొరతపై కఠిన చర్యలు!

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా మార్చి-05 వాయిస్ టుడే : ఆసుపత్రిలో మందుల కొరత రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆసుపత్రి ఓపి సేవలను పరిశీలించి డెంటల్ ఓపి కు వస్తున్న కేసులు , అందిస్తున్న చికిత్స గురించి వివరాలు తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలకు రెగ్యులర్ హెల్త్ చెక్ అప్ షెడ్యూల్ ప్రకారం జరిగేలా చూడాలని, అవసరమైన వ్యాక్సినేషన్ వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.రోగులతో ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఆసుపత్రి కి వచ్చిన పేషంట్ లతో మాట్లాడి ఎన్.సి.డి విభాగం, పరిశీలించి ఎట్టి పరిస్థితుల్లో మందుల కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి ఆర్.ఎం.ఓ, సిబ్బంది, పాల్గొన్నారు.



# మహిళా స్త్రీ శక్తి భవనానికి శంకుస్థాపన

**గ్రామాభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం**

**కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంత్ రావు పాటిల్**

ఝరాసంగం మార్చ్ 05 (వాయిస్ టుడే): ఝరాసంగం మండలం కప్పా డ్ గ్రమంలో ఈరోజు గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి ఘనంగా భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ కీర్తన ప్రభాకర్ , ఉప సర్పంచ్ బీరదర్ లక్ష్మి సురేష్ భూమి పూజా నిర్వహించడం జరిగింది.ముఖ్య అతిథులుగా హాజరై,న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీ హన్మంత్ రావు పాటిల్ .ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "మహిళా సంఘాల సభ్యులు తమ సమావేశాలను మరియు ఇతర కార్యకలాపాలను సొంత భవనంలో నిర్వహించుకోవడం వల్ల వారి ఆర్థిక, సామాజిక సాధికారత మరింత మెరుగుపడుతుంది. గ్రామ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉంది, ఈ భవనం వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది" అని ఆశాభావం వ్యక్తం చేశారు.అలాగే, జహీరాబాద్ ఎంపి సురేష్ శెట్కార్ సహకారంతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని, ప్రజలందరికీ మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కేతకి డైరెక్టర్ మల్లప్ప పాటిల్,మాజీ సర్పంచ్ నందప్ప పటేల్, కాంగ్రెస్ నాయకులు సంగ్రామ్ పటేల్ వేణుగోపాల్, డప్పూర్ సంగమేష్,శ్రీకాంత్ రెడ్డి,మారుతి రావు పాటిల్, రాజు స్వామి సుభాష్ బసవరాజ్ పటేల్ సయ్యద్ షకీల్ నావజ్ రెడ్డి, రాఘవేందర్ గోపాల్, సంఘమేశ్వర్ వార్డు సభ్యులు మొల్ల మౌలానా మంగలి సుధాకర్, మ్యాతరి మహేష్. గ్రామ సంఘం అధ్యక్షురాలు బి. అనిత కార్యదర్శి సూకన్య,ఐకేపీవీవోఏ ఖాజా, రాజు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

**పట్టణంలో అవసరమైనచోట పైపులైను ఏర్పాటు చేయాలి**

**మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్**

హుజూర్ నగర్ మార్చ్ 05 (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్ నగర్ పట్టణంలో తాగు నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట పైపులైన్ వేయాలని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంచినీటి సరఫరాపై కౌన్సిలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో. హుజూర్ నగర్ మున్సిపాలిటీలోని 28 వార్డుల పై సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రజలకు వేసవిలో తాగునీరు అందించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మున్సిపల్ సిబ్బంది అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. మిషన్ భగీరథ నీరును ఇంటింటికి సరఫరా చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జునరావు, ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్ , ఏఈ వినోద్ కుమార్, కౌన్సిలర్లు మంజుల, పద్మ, కోల,ఉదయభాను, దగ్గుబాటి కవిత, కృష్ణ,ధనమ్మ,నాగలక్ష్మి నాగమణి, ఊహ, చంటి సైదులు శ్రీనివాసు విజయ్ పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**